రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
ప్రజా TV
PRAJA TELEVISION
The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్



Bhavani Publication Trust
APTEL/2001/5268
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

సంపుటి : 24 | సంచిక : 351 | హైదరాబాద్ | బుధవారం 4 డిసెంబర్ 2024 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR


## ఫోన్ ట్యాపింగ్‌లో ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కేసు

### బీజేపీ నేత చక్రధర్ గౌడ్ ఫిర్యాదు



(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)
ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావుపై హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళవారం సిద్దిపేటకు చెందిన గడగోని చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హరీశ్ రావుతో పాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావుపై ఆయన ఫిర్యాదు చేశారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హరీశ్ రావు, రాధా కిషన్ రావు ఆదేశాలతో తన ఫోన్ ట్యాప్ చేశారని చక్రధర్ గౌడ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాక, తనపై అక్రమ కేసులు పెట్టి వేధించారని, తన కుటుంబ సభ్యులను

- మిగతా 2వ పేజీలో



## ఎవరు అడ్డుపడినా
# మూసీ పునరుజ్జీవం ఆగదు

హైదరాబాద్ అభివృద్ధికి బీజేపీ అడ్డు
కిషన్‌రెడ్డి రాష్ట్రానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలి
పదేండ్లలో బీఆర్ఎస్ నగరాన్ని మురికి కూపంగా మార్చింది
రూ.5827 కోట్లతో అభివృద్ధి పనులు
న్యూయార్క్‌తో సమానంగా ఫ్యూచర్ సిటీ :
హైదరాబాద్ రైజింగ్ సభలో
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ నగరాభివృద్ధిని బీజేపీ అడ్డుకుంటోంది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మా కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారు. మూసీ ప్రాజెక్టును వద్దంటున్న ఆయన కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలి. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో నగరాన్ని మురికి కూపంగా మార్చింది. ఢిల్లీ నగరం పూర్తిగా కాలుష్యమయమైంది. ముంబై, చెన్నైలో వరదలు వస్తే నివసించలేని పరిస్థితి. బెంగుళూరులో గంటలకొద్దీ ట్రాఫిక్ కష్టాలు. కలకత్తాలో ఉన్నన్ని సమస్యలు ఎక్కడా లేవు.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)
దేశంలోని మెట్రో పాలిటన్ నగరాలు సమస్యల వలయంగా మారాయి. హైదరాబాద్ వాటి సరసన చేరకూడదనే దూర దృష్టితోనే మూసీ సుందరీకరణను చేపట్టాం. ఎవరడ్డుకున్నా ఈ ప్రాజెక్ట్ ఆగదు" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన

- మిగతా 2వ పేజీలో

## ఏపీ కేబినెట్‌లో కీలక నిర్ణయాలు..



2లో

## సంభల్ హింస వెనక కుట్ర!

యూపీలో ఉప ఎన్నికల నేపథ్యంలో వివాదం
మతసామరస్యాన్ని దెబ్బతీస్తోన్న బీజేపీ
లోక్‌సభలో అఖిలేశ్ యాదవ్ విమర్శ
అదానీ అంశంపై పార్లమెంటు ప్రాంగణంలో విపక్ష ఎంపీల నిరసన




(ప్రజాతీర్పు ప్రతినిధి, న్యూఢిల్లీ)
యూపీలోని సంభల్‌లో చెలరేగిన హింస వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, బీజేపీ జపిస్తున్న 'తవ్వకాల మంత్రం' దేశంలో మతసామరస్యాన్ని దారుణంగా దెబ్బతీస్తోందని సమాజ్‌వాదీపార్టీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. యూపీలో ఇటీవలి ఉప ఎన్నికల నేపథ్యంలోనే.. సంభల్‌లో మసీదు వివాదాన్ని ముందుకు తీసుకొచ్చారన్నారు. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో అఖిలేశ్ మాట్లాడారు. 'నవంబరు 13వ తేదీన జరగాల్సిన యూపీ ఉప ఎన్నికలను నవంబరు 20వ తేదీకి వాయిదా వేశారు. షాహీ జామామసీదులో సర్వే జరపాలంటూ దాఖలైన పిటిషన్ మీద.. మసీదు కమిటీ వాదనలు సైతం వినకుండా సర్వేకు అనుకూలంగా నవంబరు 19న స్థానిక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొన్ని గంటల్లోనే అధికారులు అక్కడికి చేరుకొని సర్వే జరిపారు. మసీదులోని వారందరూ సహకరించారు. 29న కోర్టులో విచారణ జరగాల్సి ఉంది. కానీ, 24న అధికారులు మరోసారి సర్వే జరుపుతామంటూ మసీదుకు వచ్చారు. కోర్టు ఉత్తర్వులు లేకుండా ఎలా జరుపుతారంటూ.. ముస్లిం సంఘాలు అభ్యంతరం తెలిపాయి. అయినప్పటికీ, అధికారులు నిరంకుశంగా సర్వే జరిపారు. ఈ సందర్భంగా ఓ పోలీసు అధికారి స్థానికులను దుర్భాషలాడుతూ లాఠీచార్జికి ఆదేశించారు. కోపోద్రిక్తులైన యువకులు కొందరు రాళ్లు విసిరారు. దీంతో పోలీసులు కాల్పులు జరిపి ఐదుగురిని చంపివేశారు' అని అఖిలేశ్ తెలిపారు. అమాయకులను పొట్టనపెట్టుకున్న పోలీసులను ఉద్యోగాల్లోంచి తొలగించి, వారిపై హత్య కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉప ఎన్నికల్లో యూపీ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడిందని, ముస్లింలను పలు ప్రాంతాల్లో

- మిగతా 2వ పేజీలో

## ఇకపై నలుగురు నామినీలు!

బ్యాంకు ఖాతాదారులకు వెసులుబాటు
బ్యాంకింగ్ చట్టాల సవరణ ..
బిల్లుకు లోక్‌సభ ఆమోదం



(ప్రజాతీర్పు ప్రతినిధి, న్యూఢిల్లీ)
బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయడానికి ఐదు చట్టాల్లో సవరణలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏటికేడు బ్యాంకింగ్ రంగం పరిణామం చెందుతున్న క్రమంలో బ్యాంకుల పాలనా వ్యవహారాలను మెరుగపర్చడం, పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం 'బ్యాంకింగ్ చట్టాల సవరణ

- మిగతా 2వ పేజీలో



## ప్రజల వద్దకే వచ్చి సమస్యలు పరిష్కరిస్తాం

### ప్రజావాణిలో మంత్రి పొన్నం ప్రభాకర్

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)
ప్రజా పాలనలో తమ ప్రభుత్వం నేరుగా ప్రజల వద్దకే వచ్చి సమస్యలు పరిష్కారం చేస్తున్నదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రజావాణిలో ప్రజలు సమస్యలపై ఇస్తున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ప్రజావాణి

- మిగతా 2వ పేజీలో

## మనుషులను ఉతికి ఆరేస్తుంది!



3

## కృత్రిమ సూర్య గ్రహణం!
### నేడు నింగిలోకి ప్రోబా-3 ఉపగ్రహాలు



3

## మళ్లీ ముంచిన జీపీఎస్!
### కాలువలోకి దూసుకెళ్లిన కారు





# ఫోన్ ట్యాపింగ్‌లో ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కేసు

(మొదటి పేజీ తరువాయి)

బెదిరించారని వివరించారు. కాగా, పోలీసులు హరీశ్‌రావు, రాధాకిషన్ రావుపై 120 (బీ), 386, 409, ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. గడగోని చక్రధర్ గౌడ్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ తరుపున పోటీ చేశారు. ప్రస్తుతం ఆయన బీజేపీ పార్టీలో ఉన్నారు. గతంలో చక్రధర్‌గౌడ్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీ నేతలు అంటున్నారు.

**హరీశ్‌రావును అరెస్టు చేయాలి : చక్రధర్ గౌడ్**

తన ఫోన్ ట్యాపింగ్ చేశారని ఎమ్మెల్యే హరీశ్‌రావుపై ఫిర్యాదు చేసిన చక్రధర్ గౌడ్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతేడాది మార్చిలో రైతు కుటుంబాలకు తాను లక్ష రూపాయల చొప్పున నగదును పంపిణీ చేశానని, ఆ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేతో సహా ఏ ఇతర రాజకీయ నేతలను ఆహ్వానించలేదని తెలిపారు. అయితే తనకు మంచి పేరు వస్తుందనే అక్కసుతో స్థానిక ఎమ్మెల్యే, అప్పటి మంత్రి హరీశ్ రావు తనపై కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. అలాగే, ఓ అగ్గిపెట్టెల పరిశ్రమను ప్రారంభిస్తే దానికి అనుమతులు లేవని అరెస్టు చేయించి జైలుకు పంపారని అన్నారు. జైలు నుంచి పది రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యాయని, అప్పటి నుంచి గుర్తు తెలియని ఫోన్ నెంబర్ల నుంచి తనను చంపేస్తామని మెసేజ్‌లు వచ్చాయని తెలిపారు. ఈ ఏడాది మార్చిలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ సమక్షంలో తాను బీజేపీలో చేరానని, అయితే పంజాగుట్టలోని తన కార్యాలయంలో మఫ్టీలో వచ్చిన పోలీసులు సోదాలు నిర్వహించారని, తనను కస్టడీలోకి తీసుకుని టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ రావు ఎదుట హాజరుపర్చారని తెలిపారు. ఆ సమయంలో హరీశ్‌రావు తనపై అగ్రహంగా ఉన్నారని, వెంటనే బీఆర్ఎస్ పార్టీలో చేరాలని రాధాకిషన్ రావు తనను ఒత్తిడి చేసినట్టు చెప్పారు.



# ఇకపై నలుగురు నామినీలు!

(మొదటి పేజీ తరువాయి)

బిల్లు-2024'ను తీసుకొచ్చినట్లు తెలిపింది. తాజా సవరణలతో బ్యాంకింగ్ రంగంలో పాలనా వ్యవహారాలు పటిష్ఠమవడంతో పాటు ఖాతాదారుల సౌలభ్యం పెరుగుతుందని, పెట్టుబడిదారులకు రక్షణ కల్పించినట్లువుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు. మంగళవారం ఆమె 'బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు-2024'ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఐదు బ్యాంకింగ్ చట్టాల్లో మొత్తం 19 సవరణలను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ బిల్లును లోక్‌సభ మూజువాణీ ఓటుతో ఆమోదించింది. అయితే, భారత బ్యాంకింగ్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించేందుకే ఈ బిల్లును తెస్తున్నారని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ వాటాను 51 నుంచి 26 శాతానికి తగ్గించాలన్నదే కేంద్రం ఉద్దేశమని ఆరోపించారు.

**బ్యాంకింగ్ బిల్లులో కీలక ప్రతిపాదనలివే..**

బ్యాంకు ఖాతాదారులు ప్రస్తుతం ఒక నామినీని మాత్రమే ఎంచుకునే వీలుండగా.. ఇకపై నలుగురిని నామినీలుగా ఎంచుకోవచ్చు.క్లెయిమ్ చేసుకోని డివిడెండ్లు, షేర్లు, బాండ్ల ఉపసంహరణ నిధులను 'ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఈపీఎఫ)'లోకి బదిలీ చేసుకోవచ్చు. ఈ ఫండ్ నుంచి వినియోగదారులు సొమ్ములను బదిలీ/రిఫండ్ చేసుకోవచ్చు. మదుపరుల ప్రయోజనాలను రక్షించేందుకే ఈ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్యాంకుల్లో డైరెక్టర్ పదవిని ఆశించే వారి కనీస వాటా ప్రస్తుత చట్టాల ప్రకారం బ్యాంకుల ఈక్విటీలో రూ.5 లక్షలుగా ఉండగా.. ఆ పరిమితిని రూ.2 కోట్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఈ మొత్తాన్ని 60 ఏళ్ల కిందట నిర్ధారించినందున తాజాగా పెంచాలని నిర్ణయించారు.సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీ కాలాన్ని 8 నుంచి పదేళ్లకు పెంచారు. ఆడిటర్లకు ఇవ్వాల్సిన పారితోషికాన్ని నిర్ణయించడంలో బ్యాంకులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు.

# సంభల్ హింస వెనక కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

ఓటు వేయకుండా అడ్డుకున్నారని.. ఇదంతా బయటకు రావొద్దనే ఉద్దేశంతోనే సంభల్‌లో హింసను రెచ్చగొట్టారని ఆరోపించారు. అంతకుముందు, సంభల్ అంశంపై చర్చకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. కొద్దిసేపు వాకౌట్ చేశారు. కాగా మంగళవారం సైతం ఆదానీ అంశంపై విపక్షాలు పట్టుబట్టాయి. ప్రశ్నోత్తరాలను ప్రారంభిస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా చెప్పగానే ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. అదానీ అంశంపై తక్షణమే చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీనికి స్పీకర్ అంగీకరించకపోవడంతో నిరసన వ్యక్తంచేస్తూ సభ నుంచి వాకౌట్ చేశాయి. అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష నేతలు ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ నిరసనలో ఇండియా కూటమి పార్టీలైన ఎస్పీ, టీఎంసీ పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది.

**ఇలాగైతే వారాంతాల్లోనూ సభ: ఓం బిర్లా**

ప్రశ్నోత్తరాల సమయంలో విపక్ష సభ్యులు పెద్దఎత్తున నినాదాలు చేయడంతో స్పీకర్ ఓంబిర్లా అసహనం వ్యక్తం చేశారు. వాయిదాల కారణంగా సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగితే, ఆ సమయాన్ని భర్తీ చేయడానికి వారాంతాల్లోనూ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుందని సభ్యులను హెచ్చరించారు. సభ కార్యకలాపాలను వాయిదా వేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

# ఎవరు అడ్డుపడినా మూసీ పునరుజ్జీవం ఆగదు

(మొదటి పేజీ తరువాయి)

రైజింగ్ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. మూసీ పునరుజ్జీవనం చేయకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మెట్రో, రీజినల్ రింగ్ రోడ్డుకు రూ.70 వేల కోట్లు అవసరం అవుతాయనీ, ఈ రెండు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెస్తారో కిషన్ రెడ్డి చెప్పాలని నిలదీశారు. గుజరాత్‌కు మోడీ నిధులు తీసుకెళ్తుంటే రాష్ట్రానికి ఎందుకు నిధులు తేవడం లేదని ప్రశ్నించారు. ”నితిన్ గడ్కరీ దగ్గర మన ప్రతిపాదనలు పెండింగ్ లో ఉన్నాయి%ౌ%నిధులు తెస్తారో%ౌ% గుజరాత్‌కు వలస వెళ్తారో కిషన్‌రెడ్డి జవాబు చెప్పాలి” అని డిమాండ్ చేశారు. ”గత సీఎం అబద్ధాలతో గడిపేశారు. పాతబస్తీని ఇస్తాంబుల్ చేస్తామన్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి గత ప్రభుత్వం చేసిందేమీ లేదు. కాలుష్యం పెరిగిపోయింది. ఆరు నెలలు నేను ఊరుకుంటా. మీరేం చేస్తారో చెప్పండి. మాకు ఎలాంటి బేషజాలు లేవు. బీఆర్ఎస్, బీజేపీకి నేను ఈ వేదిక నుంచి పిలుపునిస్తున్నా. మీ పాలసీ డాక్యుమెంట్లు తీసుకురండి. సహేతుకమైతే నూటికి నూరు శాతం మీ ప్రతిపాదనతో ముందుకెళతాం. మీరిద్దరూ గూడుపుఠానితో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు ఆపండి” అని సీఎం హితవు పలికారు. ”హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల సరసన నిలిపేందుకు ప్రణాళికతో ముందుకు పోతున్నాం. నగరంలో ఐటీ అభివృద్ధికి పునాదులు వేసింది కాంగ్రెస్ పార్టీ. నగరంలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కృష్ణా జలాలతో పాటు గోదావరి జలాలను తీసుకొచ్చాం. మా పార్టీ ముందుచూపుతో వ్యవహరించడంతోనే హైదరాబాద్ నగరంలో తాగు నీటి సమస్య పరిష్కారమైంది. నగరానికి మెట్రోను తీసుకొచ్చేందుకు ఆనాడు కేంద్రమంత్రిగా జైపాల్ రెడ్డి ఎంతో కృషి చేశారు. మేం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించాం. గతంలో మా ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలతోనే ఇప్పుడు పెట్టుబడులు వస్తున్నాయి. రూ.35 వేల కోట్లతో 360 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించబోతున్నాం. వాటికి అనుసంధానంగా రేడియల్ రోడ్లు నిర్మించి నగరాన్ని



మరింత అభివృద్ధి చేయనున్నాం. ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్లో కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. 40 నుంచి 50వేల ఎకరాల్లో అంతర్జాతీయ నగరాలైన న్యూయార్క్, టోక్యోల తరహాలో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తాం. 10 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసేలా వాటర్ హార్వెస్టింగ్ బావులను నిర్మిస్తున్నాం. మా ప్రభుత్వ హయాంలో స్థిరాస్తి వ్యాపారం 29 శాతం పెరిగింది. అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చుతోంది” అని అన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ నగరాలకు ధీటుగా జరుగుతున్న అభివృద్ధికి అందరూ సహకించాలని కోరారు.

## రూ.5,827 కోట్లతో చేపట్టిన పనులు

1). గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలో ఫేజ్-1లో రూ.3446 కోట్లతో పనులు

2).రహదారులు, జంక్షన్ల సుందరీకరణకు రూ.150 కోట్లు,

3). వర్షపు నీటి సంరక్షణ, వరద నీటిని నియంత్రించే పనులకు రూ.17 కోట్లు,

4).హైదరాబాద్ జల మండలి అధ్వర్యంలో రూ.669 కోట్ల పనులు

5).తాగునీటి సరఫరాకు అవుటర్ రింగ్ రోడ్డు చుట్టూ వివిధ ప్రాంతాల్లో రూ.45 కోట్లతో చేపట్టిన 19 రిజర్వాయర్లు

6). హైదరాబాద్ రోడ్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డీసీఎల్) అధ్వర్యంలో గ్రేటర్ సిటీలో రూ.1500 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు

7). ఏఐ అనుసంధానంతో కొత్త ఆన్లైన్ బిల్డింగ్ అప్రూవల్, లేఅవుట్ అప్రూవల్ సాఫ్ట్ వేర్ ప్రారంభం

హైదరాబాద్ అబివృద్ధిపై మంత్రివర్గ ఉపసంఘం..

”హైదరాబాద్ అభివృద్ధిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తున్నాం. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సబ్‌కమిటీలో సభ్యులుగా ఉంటారు. మాది ప్రజా ప్రభుత్వం. ప్రతిపక్షాల సలహాలు స్వీకరిస్తాం. రాష్ట్రాభివృద్ధికి బీఆర్ఎస్, బీజేపీ ఉపసంఘానికి ప్రతిపాదనలు, సూచనలు ఇవ్వాలి. మేధావులు కూడా అభివృద్ధికి ప్రతిపాదనలు చేయాలి. సహేతుకంగా ఉంటే అమలు చేస్తాం. గోదావరి జలాలు మూసీలో పారాలి. మాపై కోపంతో నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను శిక్షించొద్దు. ప్రభుత్వం ఏం చేసినా అడ్డుకుంటామంటే అంగీకరించం. అభివృద్ధిని అడ్డుకునేవాళ్లను ఎలా ఆపాలో మాకు తెలుసు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే బాధ్యత మేం తీసుకున్నాం. అందరూ సహకరించాలి” అని సీఎం ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవెలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన రూ.5827 కోట్ల వివిధ అభివృద్ధి పనులను ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు.

# ఏపీ కేబినెట్‌లో కీలక నిర్ణయాలు..

(ప్రజాతీర్పు ప్రతినిధి, అమరావతి )

ఏపీ కేబినెట్ పలు సంచలన నిర్ణయాలు తీసుకుంది. ఇవాళ(మంగళవారం) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 10 అంశాలపై కీలకంగా చర్చించారు. పలు పాలసీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 3గంటల పాటు ఈ సమావేశం సాగింది. జలజీవన్ మిషన్ సక్రమ వినియోగంలో జాప్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ డీపీఆర్‌ల స్థాయి దాటి ఎందుకు ముందుకెళ్లట్లేదని అధికారులను సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. ప్రతీ ఒక్కరికీ తాగునీరు అందించే ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవట్లేదని ఢిల్లీలోనూ చెబుతున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. బ్యూరోక్రసీ ఆలస్యం కావడం వల్లే మంచి పథకం సద్వినియోగం కావట్లేదని ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తే జలజీవన్ పథకం అద్భుత ఫలితాలు ఇస్తుందని మంత్రి నారా లోకేష్ వివరించారు.

జేజేఎం ప్రతీ ఒక్కరికీ రీచ్ అయ్యే అతి పెద్ద ప్రాజెక్ట్ అని లోకేష్ తెలిపారు. పథకాలు సక్రమ వినియోగంపై అధికారులు దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు గట్టిగా చెప్పారు. అధికారులకు పనిపై కమిట్మెంట్ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. అధికారుల్లో అలసత్వం కనిపిస్తోందని మండిపడ్డారు. ఆయా శాఖల్లో కేంద్ర ప్రభుత్వం నిధులు ఉన్నాయని అధికారులు చెప్పాలి కదా అని నిలదీశారు. ఢిల్లీకి వెళ్తే అక్కడి అధికారులందరూ మీ బ్యూరోక్రసీ ఎక్కడుందని అడుగుతున్నారని అన్నారు. మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు. మంత్రులు కూడా క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని.. ఇలా చేస్తే మంత్రులకు అవగాహన పెరుగుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పులివెందుల, ఉద్దానం, డోన్‌లో తాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. డిసెంబర్12తో కూటమి ప్రభుత్వం ఏర్పడి 6నెలలు పూర్తవుతుంది. ఎవరేం చేశారో సమగ్ర నివేదిక ఇస్తే స్ట్రీమ్ లైన్ చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. లిక్కర్, ఇసుక మాఫియాలను అరికట్టాం, చిన్న చిన్న సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని మాటిచ్చారు. రేషన్ మాఫియాను అరికడుతున్నాం, ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ద్వారా రెవెన్యూ సమస్యలూ పరిష్కరిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. డిసెంబర్ 15వ తేదీన పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం జరపాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఐటీ, టెక్స్‌టైల్, మారీటైమ్ పాలసీలకు మంత్రివర్గం ఆమోదం తెలపింది. పర్యాటక, స్పోర్ట్స్ పాలసీల్లో పలు సవరణలకు కూడా మంత్రివర్గం ఆమోదించింది.

# ప్రజల వద్దకే వచ్చి సమస్యలు పరిష్కరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 430 దరఖాస్తులు అందాయి. సిరిసిల్ల జిల్లాలో తమపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేశారంటూ ఓ మహిళ ఫిర్యాదు చేయగా..సిరిసిల్ల ఎస్పీతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లో మాట్లాడారు. బోధన్, మెదక్, మెట్ పల్లి నిజాం షుగర్ కర్మగారాలలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలను ఇప్పించాలని కోరుతూ కార్మికులు అర్జీ ఇచ్చారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి త్వరలోనే జీతాల సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తామని హామీనిచ్చారు. బేగంపేట్, అమీర్ పేట్ సహా పలు ప్రాంతాల్లోని హాకర్స్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చిన్నారెడ్డి, దివ్య హామీనిచ్చారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారుల నుంచి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని హాకర్స్ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. 61 ఏండ్ల పైబడిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం త్వరలోనే పరిష్కార మార్గం చూస్తుందని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని చిన్నారెడ్డి, దివ్య భరోసా ఇచ్చారు. తార్నాక, కవాడిగూడ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు మహిళలు తమకు పింఛన్లు మంజూరు చేయాలని కోరగా..తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

# శ్రీశైలం మల్లన్న భక్తులకు అలెర్ట్.. దర్శన సమయాలు మారినయ్..!

జ్యోతిర్లింగ క్షేత్రం, శక్తిపీఠమైన శ్రీశైలానికి వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతున్నది. క్రమంలో దర్శన విధానంలో మార్పులు చేసినట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం కల్పిస్తూ రద్దీ రోజుల్లో మల్లన్న దర్శన భాగ్యం అందరికీ ఒకేలా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వారాంతపు రోజులు, ప్రభుత్వ సెలవుదినాలు, వైదిక కమిటీ సూచించిన ప్రత్యేక పర్వదినాలు, మహోత్సవాల సమయంలో గర్భాలయ అభిషేకాలు, స్పర్శ దర్శనాలు, శ్రీచక్ర కుంకుమార్చనలతోపాటు ఉదయాస్తమాన సేవ, ప్రాతః కాలసేవ, ప్రదోషకాల సేవలను సైతం నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా శ్రీవృద్ధ మల్లికార్జున స్వామికి జరిపించే అభిషేకాలు, బిల్వార్చనలు యథావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వారాంతపు సెలవుల్లో రోజుకు 40వేల మంది భక్తులకుపైగా స్వామి అమ్మవార్లను



దర్శించుకుంటున్నారు. మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాల సమయంలో రోజుకు దాదాపు లక్ష మందికిపైగా భక్తులు క్షేత్రానికి తరలివస్తున్నారని ఈవో పేర్కొన్నారు. రద్దీ రోజుల్లో భక్తులందరి దర్శనార్థం దేవస్థానం వైదిక కమిటీ తీసుకున్న నిర్ణయాలకు భక్తులు సైతం సహకరించాలని ఈవో కోరారు.

# లా డే సందర్భంగా సీనియర్ న్యాయవాదులకు ఘన సన్మానం

(ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ )

న్యాయవాదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టిపిసిసి జాయింట్ కన్వీనర్ భూక్యా రజనీష్ ,కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ కల్లేపెల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో మంగళవారం పలువురు సీనియర్ న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల మీటింగ్ హాల్ లో న్యాయ వాద వృతి లో 35 సం. లు పైబడిన సీనియర్ న్యాయవాదులు గులాబీల మల్లారెడ్డి పటేల్, మరొాజు రామకృష్ణ చారి, మెట్ట అనిల్ కుమార్, డి మల్లయ్య, కుసుంబా కృష్ణ రావు, కొరివి వేణు గోపాల్ లను శాలువా, బొకే లతో ఘనంగా సన్మానించారు. ఇటీవల కాంగ్రెస్ లీగల్ సెల్ మీడియా కన్వీనర్ గా నియమితులైన కొత్త ప్రకాశ్ ను శాలువా, బొకే తో సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతు న్యాయవాది వృతి లో ఎంతో పవిత్ర మైనదని జూనియర్ న్యాయవాదులు కేసుల విషయం లో డౌట్ లు ఉంటే సీనియర్ ల సలహాలు సూచనలు



తీసుకోవాలని, డబ్బులే ముఖ్యం కాదని అన్నారు. ఎంత సీనియర్ ఐన నిత్య విద్యార్థి నని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ లీగల్ సెల్ బాద్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ బాధ్యులు వి కృష్ణ, కె శంకర్, శ్రీకాంత్, శ్రీరాముల కిషన్, సృజన్, రాజు, బాలకిషన్, రాచకొండ ప్రభాకర్, పర్లపెల్లి వేణుగోపాల్, లక్షమన్ రావు, చక్రధర్, ప్రభాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## అప్పటిలోపు వారిని విడుదల చేయకపోతే.. హమాస్‌కు ట్రంప్ సీరియస్ వార్నింగ్



ఇజ్రాయెల్ - హమాస్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే హమాస్‌కు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టకముందే హమాస్ ఉగ్రవాద సంస్థ చెరలో ఉన్న బందీలను విడిచిపెట్టాలని అల్టిమేటం జారీ చేశారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తాను అమెరికా అధ్యక్షుడిగా 2025 జనవరి 20న బాధ్యతలు స్వీకరిస్తానని ట్రంప్ స్పష్టం చేశారు. ఈలోపు బందీలను విడుదల చేయాలని తేల్చి చెప్పారు. లేదంటూ నరకం చూస్తారని, గతంలో ఎన్నడూ చూడని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు. కాగా, గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో వెయ్యి మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. దాడి అనంతరం దాదాపు 200 మందికిపైగా ప్రజలను హమాస్ బంధించి గాజాలోకి తీసుకెళ్లింది. ఆ తర్వాత తాత్కాలికంగా జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం సందర్భంగా కొందరిని విడుదల చేసింది. బంధీల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 51 మంది సజీవంగా ఉన్నారు. బందీలకు సంబంధించిన వీడియో హమాస్ మిలిటరీ విభాగం ఇటీవలే విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో అమెరికా - ఇజ్రాయెల్ జాతీయుడైన 20 ఏళ్ల ఎడాన్ అలెగ్జాండర్ మాట్లాడుతూ.. మమ్మల్ని హమాస్ చెర నుంచి త్వరగా విడిపించండి అంటూ వేడుకుంటూ కన్నీటి పర్యంతమయ్యాడు.

## మనుషులను ఉతికి ఆరేస్తుంది!

బట్టలు ఉతికి ఆరేసినట్టు మనుషులను కూడా ఉతికి ఆరేసే 'హ్యూమన్ వాషింగ్ మెషీన్లు' భవిష్యత్తులో రాబోతున్నాయి. బాగా అలసిపోయిన వ్యక్తి స్నానం చేసే ఓపిక లేకపోతే.. మెషీన్‌లోని టబ్‌లో 15 నిమిషాలు కూర్చుంటే చాలు! కొద్ది నిమిషాల తర్వాత తలతలలాడే శరీరంతో బయటకు రావొచ్చు! మెషీన్‌లోని 'ఏఐ' (కృత్రిమ మేధ) వ్యక్తి శరీరం, చర్మం తీరును పరిగణనలోకి తీసుకొని వాష్ అండ్ డ్రై ఆప్షన్స్ నిర్ణయిస్తుంది. జపాన్‌కు చెందిన 'సైన్స్ కో' కంపెనీ ఇంజనీర్లు ఈ మెషీన్‌ను



తయారుచేసినట్టు 'డెయిలీ మెయిల్' కథనం పేర్కొన్నది. ఒసాకా కన్సాయ్ ఎక్స్‌పోలో 1,000 మంది అతిథులు ప్రయోగాత్మకంగా వాడుకోవటానికి ఏర్పాట్లు జరిగాయి. ఈ ప్రదర్శన తర్వాత మాస్ ప్రొడక్షన్ వర్షన్‌ను విడుదల చేస్తామని 'సైన్స్ కో' కంపెనీ చైర్మన్ ఆయోమా వెల్లడించారు. మనుషుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని జపాన్ ఇంజినీర్లు దీనిని తయారుశారు. అయితే.. ఈ మెషీన్ డిజైన్ 50 ఏండ్ల క్రితం నాటిది. 1970లో జపాన్ వరల్డ్ సాన్యో ఎలక్ట్రిక్ కో (ప్రస్తుతం పానసోనిక్) దీనిని మొదటిసారి తయారుచేసింది. దాంతో పోల్చితే కొత్త వెర్షన్‌లో అత్యధిక మసాజ్ బాల్స్ వంటివి అమర్చినట్టు తయారీదారులు పేర్కొన్నారు.

### ఎలా పనిచేస్తుంది?

ఫైటర్‌జెట్ కాక్‌పీట్ ఆకారంలోని ప్లాస్టిక్ ప్యాడ్‌లోకి మనిషి ప్రవేశించాక, అది సగానికిపైగా గోరువెచ్చని నీరు నిండుతుంది. ఆ తర్వాత అందులోని హైస్పీడ్ జెట్స్ నీటిని వేగంగా విరజిమ్ముతుంది. స్నానం చేసే వ్యక్తిని ఆహ్లాదపర్చేందుకు ఇందులో ఏర్పాట్లు ఉన్నాయట. ఏఐ ద్వారా స్నానం చేస్తున్న వ్యక్తి శారీరక పరిస్థితిని మెషీన్ సేకరిస్తుందట.

## భారత హై కమిషనర్‌కు బంగ్లాదేశ్ సమన్లు అగర్తలలో దౌత్యసేవలు నిలిపివేత

పొరుగుదేశం బంగ్లాదేశ్ మనపై కవ్వింపు చర్యలు కొనసాగిస్తూనే ఉంది. బంగ్లాదేశ్‌లోని భారత హై కమిషనర్ ప్రణయ్ వర్మకు మంగళవారం సమన్లు జారీ చేసింది. దీంతో వర్మ బంగ్లాదేశ్ ఉన్నతాధికారులతో సమావేశ మ య్యారు. త్రిపుర రాజధాని అగర్తలలోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాన్ని ఆందోళన కారులు ముట్టడించిన నేపథ్యంలో ఈ సమన్లు జారీచేసి నట్టు సమాచారం. అగర్తలలోని బంగ్లాదేశ్ అసిస్టెంట్ హై కమిషన్‌లో అన్ని దౌత్య సేవలు నిలిపివేస్తున్నామని బంగ్లాదేశ్ అధికారి ఒకరు తెలిపారు.




## మళ్లీ ముంచిన జీపీఎస్! కాలువలోకి దూసుకెళ్లిన కారు

గూగుల్ మ్యాప్స్‌ను అనుసరిస్తూ ఉత్తరప్రదేశ్ బరేలీ జిల్లాలో మరో కారు ప్రమాదానికి గురైంది. బరేలి-పిలిభిత్ రాష్ట్ర రహదారిపై ప్రయాణిస్తున్న ఓ కారు.. దారి తప్పి నది కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. మంగళవారం బర్కాపూర్ గ్రామం కూడలికి సమీపంలో కాలాపూర్ కాలువ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఆరియా నుంచి సెడాన్ కారులో బయల్దేరిన దివ్యాంషు సింఘ్, మరో ఇద్దరు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఎమర్జెన్సీ టీమ్ ఘటనాస్థలానికి చేరుకొని కారును క్రేన్ సహాయంతో కాలువ నుంచి బయటకు తీసుకొచ్చారు. కాలువ నీటికి అక్కడి రోడ్డు కోతకు గురైన సంగతి గూగుల్ మ్యాప్స్ నావిగేషన్‌లో అప్‌డేట్ కాకపోవటం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. 'మేం ప్రయాణిస్తున్న కారు బరేలీ బడా బైపాస్‌కు చేరుకున్నాక, గూగుల్ మ్యాప్స్ పిలిభిత్‌కు వెళ్లే రెండు దారులను చూపింది. ఇందులో ఓ గ్రామం నుంచి షార్ట్‌కట్ దారి ఉందని భావించాం. 5 కిలోమీటర్లు వెళ్లాక.. రోడ్డు తెగిపోయి ఉంది. కారు కాలువలోకి దూసుకెళ్లింది' అని బాధితులు వివరించారు. జీపీఎస్‌ను అనుసరిస్తూ కారు ప్రమాదానికి గురవ్వటం బరేలీ జిల్లాలో ఇది రెండో






ఘటన. పది రోజుల (నవంబర్ 24న) క్రితం మైన్‌పూర్‌కు చెందిన ఓ కారు రామ్‌గంగా నదిపై నిర్మాణంలో ఉన్న వంతెనపైకి వెళ్లి.. అక్కడ్నుంచి కిందకు పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వంతెన మార్గానికి సంబంధించిన సమాచారం గూగుల్ మ్యాప్స్ నావిగేషన్ అప్‌డేట్ కాకపోవటమే ఈ ప్రమాదానికి కారణమని తెలిసింది.



## కృత్రిమ సూర్య గ్రహణం! నేడు నింగిలోకి ప్రోబా-3 ఉపగ్రహాలు

ఖగోళ పరిశోధనల్లో సత్తా చాటుతున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అద్భుత ప్రయోగానికి సిద్ధమైంది. కృత్రిమ సూర్య గ్రహణాన్ని సృష్టించడం ద్వారా భానుడి గుట్టు విప్పేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3 మిషన్ శాటిలైట్లను నింగిలోకి పంపనున్నది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం సాయంత్రం 4.06 గంటలకు పీఎస్ఎల్‌వీ-సీ59 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నది. ప్రోబా-3 మిషన్‌లో రెండు ఉపగ్రహాలు (కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్, ఆక్యుల్టర్ స్పేస్‌క్రాఫ్ట్) ఉంటాయి. మొత్తం దాదాపు 550 కిలోల బరువు ఉండే ఈ ఉపగ్రహాలను అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. కృత్రిమ గ్రహణాన్ని సృష్టించడం ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడం ప్రోబా-3 లక్ష్యం. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆ రెండు ఉపగ్రహాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరిస్తాయి. ప్రపంచంలో ఇలాంటి ప్రయోగాన్ని నిర్వహించడం ఇదే తొలిసారి.

## మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్! డిప్యూటీ సీఎంలుగా షిండే, అజిత్ పవార్

మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ పేరు దాదాపు ఖరారైంది. ఉపముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ నియమితులు కానున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో ఈ నెల 5న సాయంత్రం 5 గంటలకు



ప్రమాణ స్వీకారోత్సవానికి ఏర్పా ట్లు ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు 40 వేల మంది కార్యకర్తలు, నేతలు కూడా హాజరుకానున్నారు. ఇందులో 10 వేల మంది కార్యకర్తలు ఏక్ హైతో సేఫ్ హై అనే సందేశంతో కూడిన టీ-షర్టులు ధరించనున్నారు.



## బ్యాలెట్ పేపర్ ద్వారా రీపోలింగ్‌కు సిద్ధమైన మహారాష్ట్రలోని గ్రామం

ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై సోలాపూర్ జిల్లాలోని మర్కడ్వాడి గ్రామ ఓటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈవీఎం ఓటింగ్‌పై అపనమ్మకం వ్యక్తం చేస్తూ గ్రామంలో ఈసారి బ్యాలెట్ పేపర్ ద్వారా మంగళవారం రీ పోలింగ్ నిర్వహించడానికి సిద్ధమయ్యారు. ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. దీంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా సోమవారం నుంచి ఈ నెల 5 వరకు గ్రామంలో కర్ఫ్యూ విధించి వారి ప్రయత్నాలను భగ్నం చేశారు. ఈ గ్రామం ఎస్సీలకు రిజర్వ్ చేసిన మల్షిరాస్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. తాజా ఎన్నికలో బీజేపీ అభ్యర్థి రామ్ సత్పుటేను ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీ అభ్యర్థి ఉత్తమ్ జన్‌కర్ 13,147 ఓట్ల తేడాతో ఓడించారు. ఎన్నికల సంఘం వెల్లడించిన వివరాల ప్రకారం ఇక్కడ సత్పుటేకు 1,003, జన్‌కర్‌కు 843 ఓట్లు వచ్చాయి. అయితే తమ మద్దతుదారుడే ఎన్నికల్లో నెగ్గినా.. బీజేపీకి గ్రామంలో అన్ని ఓట్లు రావడం ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవీఏ)కి ఎక్కువ మంది మద్దతుదారులున్న గ్రామస్తులకు ఆగ్రహం కలిగించింది. తమ గ్రామంలో సత్పుటేకు అన్ని ఓట్లు వచ్చే ప్రసక్తే లేదని, ఈవీఎంలలో గంగరగోళమే దీనికి కారణమని వారు ఆరోపించారు. ఈ ఓటింగ్‌లో పాల్గొనాలంటూ గ్రామమంతా పెద్దయెత్తున బ్యానర్లు కూడా వెలిశాయి. అయితే ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలంటూ గ్రామస్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని అధికారులు తిరస్కరించారు. ' పారద˘ర్శకంగా నిర్వహించిన ఎన్నికల్లో ఇక్కడ ఎన్నికల ప్రక్రియ నవంబర్ 23నే ముగిసింది. ఇక్కడ మూడు బూత్‌ల్లో జరిగిన పోలింగ్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదు' అని మల్షిరాస్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి విజయ్ పంగ ర్కర్ తెలిపారు. గ్రామస్తుల చర్యలపై సోలాపూర్ జిల్లా యం త్రాంగం అసం తృప్తి వ్యక్తం చేసింది. అలాంటి ప్రయత్నాలు ఉద్రిక్త పరిస్థి తులకు దారితీస్తాయని హెచ్చరించింది. 'పరిస్థితులు ఎలా ఉన్నా ఓటింగ్ నిర్వహిం చడానికి ప్రజలు సిద్ధమయ్యారు' అని ఎన్నికైన ఉత్తమ్‌రావ్ జన్‌కర్ పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ మన్మోహన్

ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ మంగళవారం సుప్రీంకోర్టు న్యాయ మూర్తిగా నియమితుల య్యారు. బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ఆయన నియామకం అమలులోకి వస్తుందని అధికారిక నోటిఫికేషన్ పేర్కొంది. జస్టిస్ మన్మోహన్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి కల్పించాలని సుప్రీంకోర్టు కొలీజియం నవంబర్ 28న సిఫార్సు చేయగా రాష్ట్రపతి ఆయ నను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా విభూ బఖ్రూ నియమితులైనట్లు న్యాయశాఖ తెలిపింది.





## రీజనల్ రింగ్ రోడ్డు వెళ్తున్నందున ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి ఒప్పుకోవడం శుభపరిణామం.

### జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి,,

**సిద్దిపేట జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి,,**

మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలో రీజనల్ రింగ్ రోడ్డు వలన భూమి కోల్పోతున్న ఆయా గ్రామాల రైతులతో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి సమావేశం నిర్వహించారు.భూమే ఆధారంగా వ్యవసాయమే బతుకుదెరువుగా జీవనం సాగిస్తున్నామని అలాంటి భూమిని రిజనల్ రింగ్ రోడ్డు కు తీసుకోవడం అత్యంత బాదకరమైనను ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఇవ్వడానికి సుముఖంగా నే ఉన్నా నష్ట పరిహారం విషయంలో ప్రత్యేక చోరవ చూపించి బహిరంగ మార్కెట్ లో ప్రస్తుతం ఉన్న ధరను ఆయా గ్రామాల వారిగా తెలుపుతు దానికనుగుణంగా తగినంత మొత్తంలో నష్టపరిహారం లేదా ల్యాండ్ పూలింగ్ లో మాదిరి అక్కడే రోడ్డు వెంబడి కొంత స్థలం అయిన ఇప్పించగలరని ఆయా గ్రామ రైతులు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజనల్ రింగ్ రోడ్డు వెళ్తున్నందున ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి ఒప్పుకోవడం శుభపరిణామం. ఆయా గ్రామాల్లో భూమి వ్యాల్యూ ను మీరు తెలిపిన వాటిని పూర్తిగా నోట్ చేసుకుని దీనిని రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించి అందరికి న్యాయం చేయడానికి నా వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ల్యాండ్ పూలింగ్ గుర్చి కూడా అధికారులతో చర్చిస్తానని తెలిపారు.



## పాత బకాయిలు చెల్లించాకే కొత్త సర్వేలు చేయించాలి

### ఎండపల్లి మండల ఆశా వర్కర్ల సంఘం డిమాండ్

**ఎండపల్లి, డిసెంబర్ 03( ప్రజా తీర్పు ప్రతినిధి)**

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న ఆశా కార్యకర్తలు గతంలో నిర్వహించిన కుష్టు వ్యాధి, కంటి వెలుగు, ఫీవర్ సర్వేలతోపాటు పల్స్ పోలియో కార్యక్రమాల బిల్లులు చెల్లించాకే మిగతా సర్వే పనులు అప్పగించాలని నిరసన వ్యక్తం చేస్తూ జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం అంబారిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం( న్యూ పిహెచ్ సి) ముందు మంగళవారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్ల సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం అంబారిపేటలో ముందస్తుగా నిరసన చేపట్టి, అనంతరం వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎండపల్లి మండల ఆశా కార్యకర్తల సంఘం నాయకురాల్లు దేవి విమల, సరస్వతి లతోపాటు ఆశా కార్యకర్తలు జాడి లక్ష్మి, దొనకొండ నర్మద, సలాది లక్ష్మి, దర్శనాల విజయ, రజిత, కవిత,గుమ్మడి విజయ, బి.కనుకమ్మ, ఆర్. స్వప్న, జ్యోతి, ప్రమీల, సరళ లతోపాటు ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆశా కార్యకర్తలంతా పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి

**భీమదేవరపల్లి, డిసెంబర్ 3( ప్రజా తీర్పు విలేఖరి )**

హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అక్కన్నపేట్ మండలం మూత్కపల్లి తండా కు చెందిన ఫుల్ నాయక్ మృతి చెందడంతో మంగళవారం నాడు ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం అధ్యక్షులు, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన కుమారుడు రాంబాబును ఓదార్చి మీ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు ఆయన వెంట నియోజకవర్గం పరిధిలోని పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు



# విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పై నిప్పులు చేరిగిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు

## మల్కాజ్గిరి నియోజకవర్గం అభివృద్ధిని అడ్డుకుంటుంది కాంగ్రెస్ నేతలే

### మల్కాజ్గిరి లో కాంగ్రెస్ పార్టీ ఉనికి కాపాడుకోవడానికి విమర్శలు

## మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని విమర్శిస్తే ఖబర్దార్

### మల్కాజ్గిరి అభివృద్ధికి శిఖండి పాత్ర వహిస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

## శిఖండి రాజకీయాలను మల్కాజిగిరి ప్రజలు గమనిస్తున్నారు

**మల్కాజ్గిరి ప్రజా తీర్పు ప్రతినిధి :-**



మల్కాజ్గిరి అభివృద్ధిని అడ్డుకుంటుంది కాంగ్రెస్ అని కార్పొరేటర్లు మేకల సునీత రాము యాదవ్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి మీనా ఉపేందర్ రెడ్డిలు మీడియా సమావేశం లో తెలిపారు . ఇటీవల కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మీద ఘాటుగా విమర్శలు చేశారు. దానికి ఖండిస్తూ మంగళవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు మరియు నాయకులు కాంగ్రెస్ నాయకులను ఘాటుగా విమర్శించారు .ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు అనవసరంగా ఎమ్మెల్యే ని విమర్శిస్తున్నారని నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలియజేశారు. మల్కాజిగిరిలో రాజకీయాలు విపరీత ధోరణి లో నడుస్తున్నాయని దయచేసి అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేసి అభివృద్ధిని అడ్డుకోవద్దని కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. ప్రజలు వేసిన ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కి సరైన గౌరవం ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం సిగ్గు చేటని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రజల కోసం పనిచేస్తుంటే ఆయనపై బురద జల్లుతున్నారని ఇది మంచి సంప్రదాయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ నాయకుల మాటలు విని అధికారులు గెలిచిన ఎమ్మెల్యే కి సహకారం అందించడంలేదని ఇది మంచి పద్ధతి కాదని అధికారులను హెచ్చరించారు. మల్కాజ్గిరి లో శిఖండి రాజకీయాలు నడుస్తున్నాయని అవి ప్రజలు గమనిస్తున్నారని తెలిపారునాయకులు పార్టీలకతీతంగా ప్రజల కోసం పోటీ పడి పనిచేయాలి కానీ అభివృద్ధిని అడ్డుకోకూడదని తెలియజేసారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే ప్రతిపక్షంలో ఉన్న పార్టీ ఎమ్మెల్యేలు ప్రజల కోసం పనిచేయకూడదా ప్రశ్నించారు.ఎవరు అడ్డుకున్నా, తమకు అధికారులు సహకరించకున్నా తాము మాత్రం ప్రజల కోసం పని చేస్తామని ప్రజలకు తెలియజేసారు. తెలంగాణ రాష్ట్రంలో 119 నియోజకవర్గాలు ఉంటే అందులో 118 నియోజకవర్గాలలో సుమారు 10 కోట్ల రూపాయల అభివృద్ధి జరిగిందన్నారు కానీ కేవలం మల్కాజ్గిరి కి నిధులు కాంగ్రెస్ నేతలు ఆపుతున్నారని చెప్పారు మరి రాజశేఖర్ రెడ్డి నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ మల్కాజ్గిరిలో దశాబ్ద కాలంగా నెరవేరని అభివృద్ధి పనులు చేస్తున్నారని చెప్పారు దీర్ఘకాలికంగా ఉన్న వాజ్పేయి నగర ఆర్ యు బి బొల్లారంలో ఆర్ యు బి గౌతమ్ నగర్ ఆర్ యు బి నిర్మాణ పనులకు విధులు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కి దక్కుతుందన్నారు దమ్ముంటే మల్కాజిగిరి అభివృద్ధికి కృషి చేయాలని హితువు పలికారు.ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, బద్దం పరశురాం రెడ్డి, మేకల రాము యాదవ్, ఏకే మురుగేష్, జగదీష్ గౌడ్, రావుల అంజయ్య ,డోలి రమేష్, ఢిల్లీ పరమేష్ ,అమిన్ ఉద్దీన్, మండలి చిన్న యాదవ్, భాగ్యానందరావు, ఉపేందర్ రెడ్డి, వంశీ ముదిరాజ్ ,ఉస్మాన్, బైరు అనిల్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 2 కోట్ల 43 లక్షల నిధులు

### తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి :-**

మేడ్చల్ మున్సిపాలిటీలో రూ. 2 కోట్ల 43 లక్షల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి శ్రీకారం చుట్టారు.మంగళవారం మేడ్చల్ మున్సిపాలిటీలో రూ. కోటి నిధులతో ఆర్సిసి పైప్లైన్ పనులు, రూ. కోటి 43 లక్షలతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణ పనులను మహేందర్రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారమైన ప్రభుత్వం గ్యారెంటీలను ప్రభుత్వం అమలుపరుస్తుందని, ఇప్పటికే ఉచిత బస్సు, వంట గ్యాస్, రైతు రెండు లక్షల రుణమాఫీ లాంటివి పూర్తయ్యాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అయ్యేలా అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గం లో ముఖ్యమంత్రి సహకారంతో అన్ని రంగాలను అభివృద్ధి పరుస్తామని మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్మికులకు భోజనాలు వడ్డించారు. అనంతరం ఘట్కేసర్ మున్సిపాలిటీలో ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో ఒక్కొక్కరికి లక్ష చొప్పున 196 మంది మహిళలకు కోటి 96 లక్షల మహిళా సంఘాల రుణాలను, ఉచిత వైద్య శిబిరం లో పిపీఈ కిట్ లను తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఇన్చార్జ్ వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

### బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు

**కూకట్పల్లి, డిసెంబర్ 3(ప్రజాతీర్పు)**

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు అన్నారు. మంగళవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీలోని శ్రీ కనకదుర్గ దేవి టెంపుల్ వారు ఏర్పాటు చేసినా 15 సీసీ కెమెరాలను బాలానగర్ సీఐ నరసింహ రాజుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏసీపీ హనుమంతా రావు మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రిచ వచ్చున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని కలనిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని, విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత అసంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. వారిని సక్రమమైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలకు, బాలికలకు ఏమైనా ఇబ్బందులు తలేత్తితే డయల్ 100, షీటీమ్కు సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుభాష్, పిసి రవీందర్, ఆలయ కమిటీ సభ్యులు మునిరాజు, బాలకృష్ణ, వెంకట్ రెడ్డి, హనుమంత్, గోపాల్ కృష్ణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.





## ఐక్యమత్యంతో పోరాడి మనకు దక్కాల్సిన హక్కులను సాధించుకోవాలి

### వేద పండితులు.. బ్రహ్మశ్రీ మోహనా చార్యులు

**జగద్గిరిగుట్ట, డిసెంబర్ 3(ప్రజాతీర్పు)**

అన్ని రంగాల్లోనూ అసమానతలు ఎదుర్కుంటున్న విశ్వకర్మలు జాతీయ స్థాయిలో, ఐక్యమత్యంగా పోరాడి మనకు దక్కాల్సిన మన హక్కులను సాధించుకోవాలని అన్నారు, వేద పండితులు బ్రహ్మర్షి మోహనా చార్యులు అన్నారు, కూకట్ పల్లి విశ్వకర్మ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో, జగద్గిరిగుట్ట లోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో,కవి గాయకుడు దరువు అంజన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో, ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహనా చార్యులు మాట్లాడుతూ, విశ్వకర్మ లేనిదే విశ్వంబు లేదు,విశ్వానికి మూలం విశ్వకర్మ అని తెలుపుతూ, విశ్వకర్మ నాటి ద్వారకా నిర్మాణం నుండి ప్రతి నిర్మాణంలో ను విశ్వకర్మ నే మూలకర్త అని, అలాంటి విశ్వకర్మలకు, సామాజికంగా,రాజకీయంగా ప్రతి అంశంలోనూ అన్యాయం జరుగుతూ వస్తుందని,శతాబ్దాల కింద పైస ఖర్చు పెడితే ఎకరాల స్థలం లభించే ఆరోజుల్లో,విశ్వకర్మ పేరు నిలుపుకోవడానికి వేల రూపాయలు ఖర్చు చేసి కోర్టులో కేసు లు కొట్లాడాల్సిన పరిస్థితి మనకు ఎదురైందని, అన్ని రంగాల్లోనూ అసమానతలు ఎదుర్కుంటున్న మనం జాతీయ స్థాయిలో ఏకమై మనకు దక్కాల్సిన మన హక్కులను సాధించుకోవాలని,అందుకు మనమంతా ఏకమవ్వాలని అందుకు నేను ముందుంటానని తెలిపారు, ఈ కార్యక్రమంలో,ఆలయ చైర్మన్ హనుమంత చారి,అధ్యక్షులు శ్రీరాముల శ్రీనివాస చారి,ప్రధాన కార్యదర్శి మనోహర్ చారి,తిరుపతి చారి,భిక్షపతి చారి,శ్రీశైలం చారి, విశ్వకర్మ విజ్ఞాన సమితి అధ్యక్షుడు వెంకటాచారి, ప్రముఖ చారి, కనకా చారి, శివాజీ, వెంకటరమణ, గోవిందా చారి,రమణా చారి,బాగవంతా చారి, నర్సయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

# సైదాపూర్ నుండి సిద్దిపేట వరకు "చందా" ప్రస్థానం అద్వితీయం?

## బ్యాక్ బోన్ అంటూ ఎవరూ లేకపోయినా రాష్ట్రస్థాయికి ఎదిగిన ఆర్యవైశ్య నేత!

### అనుహ్యంగా సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన చందా శ్రీనివాస్

### అంబరాన్ని తాకిన ఆర్యవైశ్యుల ఆనందోత్సాహాలు

### హరీష్ రావు... కెప్టెన్.. సతీష్ బాబుల శుభాకాంక్షలు

**తిరునగరి ఆంజనేయస్వామి ప్రజాతీర్పు ప్రతినిధి హుజురాబాద్**



పువ్వు పుట్టగానే పరిమళించినట్లుగా.... ఒక సామాన్య నిరుపేద కుటుంబంలో... అందునా ఒక మారుమూల వెనుకబడిన మండల కేంద్రానికి చెందిన ఒక ఆర్యవైశ్య యువ నాయకుడు ఎలాంటి రాజకీయ సహకారం లేకపోయిననూ... ఇతరత్రా ఎలాంటి బ్యాక్ బోన్ సహకారం లేకపోయిననూ స్వశక్తితో అంచలంచలుగా ఎదిగి... ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన ఆర్యవైశ్యులలో చందా శ్రీనివాస్ పేరు ముందు వరుసలో లిఖించక తప్పదు. ఆర్య వైశ్యులు సహజంగా తమ వ్యాపారాలు ఏమిటో చూసుకుంటూ అందులోనే తమ జీవితాలను చివరి వరకు కొనసాగిస్తుంటారు. అందుకు విరుద్ధంగా చందా శ్రీనివాస్ నిరుపేద అయినప్పటికీ బాల్యంలో అనేక కష్టనష్టాలను ఎదుర్కొని సొంత కులస్తులతో నిత్య సంబంధాలు కొనసాగిస్తూ... పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలతో సఖ్యతగా ఉంటూ చిన్న వయసులో సైదాపూర్ సర్పంచ్ గా ఎన్నిక కావడం ద్వారా ఆయన అందరి దృష్టిని ఆకర్షించారు. సర్పంచ్ గా ఐదేళ్లపాటు అధికారం చేలాయించినప్పటికి ఏ ఒక్కరోజు ఆయన ప్రజలకు దూరంగా ఉండలేకపోయారు. ఆర్యవైశ్యులలో ఎవరికి ఎలాంటి ఆపద... సమస్య ఎదురైనను తక్షణమే స్పందించి మానవతను చాటుకున్న నాయకునిగా అనతి కాలంలోనే చంద శ్రీనివాస్ తన ప్రతిభను చాటుకున్నారు. అలా సైదాపూర్ మండల కేంద్రం నుండి సిద్ధిపేట జిల్లా వరకు ఆయన ప్రస్థానం అద్వితీయంగా కొనసాగడానికి ఆయన వ్యవహార శైలియే ప్రధాన కారణమని చెప్పక తప్పదు.. అందువల్లనే ఆర్యవైశ్యులలో సిద్ధిపేట జిల్లాకు సంబంధించి ఆ కులంలో ఉద్ధండులు ఉన్నప్పటికీ సిద్ధిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గా చందా శ్రీనివాస్ ఎన్నికయ్యారు అంటేనే ఆయన వ్యవహారశైలి ఏమిటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. చందా శ్రీనివాస్ నియామకం పట్ల తెలంగాణ రాష్ట్ర సమితి సీనియర్ నేత... మాజీ మంత్రి... సిద్ధిపేట శాసనసభ్యులైనా హరీష్ రావు... మాజీ రాజ్యసభ సభ్యులు... మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతరావు... హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితెల సతీష్ బాబు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. హుజూరాబాద్ పాతా తాలూకా పరిధిలోని సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన చందా శ్రీనివాస్ వైశ్య కుటుంబం నుంచి ప్రజాసేవలో నిబద్ధతతో అంచలంచెలుగా ఎదిగారు. వివిధ పదవుల్లో పనిచేసిన ఆయన ఆర్యవైశ్య కులానికి, సైదాపూర్ గ్రామ ప్రజలకు సేవలు చేసిన నేతగా గుర్తింపు పొందారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన చిరు వ్యాపారి కుటుంబానికి చెందిన చందా నందయ్య- భూలక్ష్మి దంపతులకు చందా శ్రీనివాస్ జన్మించారు. అట్టడుగు స్థాయి నుంచి తన చతురతతో, మేధాశక్తితో అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. సైదాపూర్ మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా 1995 నుంచి 2023 వరకు 29 సంవత్సరాల పాటు పనిచేశారు. ఈ క్రమంలో ఆర్యవైశ్యుల కులానికి, వ్యాపారులకు ఏ సమస్య వచ్చినా తాను ఉన్నానంటూ ముందు నడిచి వారి మన్ననలు పొందారు. 2019 నుంచి 2024 వరకు సైదాపూర్ సర్పంచిగా, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షునిగా పనిచేశారు. ఈ క్రమంలో గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపించి గ్రామ ప్రజల మన్ననలు పొందారు. సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షునిగా మండలం పరిధిలోని గ్రామాలలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారంలో పాలుపంచుకున్నారు. ఈ క్రమంలో గతంలో 40 ఏళ్లుగా ఆర్యవైశ్య కుటుంబాలకు, ప్రజలకు సేవలు అందించడాన్ని గుర్తించిన సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆయనను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకుంది. చందా శ్రీనివాస్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నిక కావడం పట్ల అటు హుస్నాబాద్... ఇటు హుజూరాబాద్ ప్రాంతలాతో పాటు జిల్లా ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, తను పుట్టి పెరిగిన సైదాపూర్ మండల ప్రజలు, మండలంలోని పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా చందా శ్రీనివాస్ మాట్లాడుతూ... తన సేవలను గుర్తించి సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండ మల్లికార్జున్, కార్యదర్శి గంప శ్రీనివాస్,నాయకులు అయిత రత్నాకర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు వెన్నంటే నిలిచిన హుస్నాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ నాయకులకు రుణపడి ఉంటానని తెలిపారు. తన మీద నమ్మకంతో ఈ పదవిని అందించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆర్యవైశ్య కుటుంబ సభ్యులకు తన వంతు సేవలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.



## ఉపకులాలకు 5శాతం రిజర్వేషన్లు కోరుతూ మంత్రులను కలిసిన బుడిగజంగాలు

### మంత్రులను కలిసిన బేడ బుడగ జంగాల నాయకులు

**ప్రజాతీర్పు ప్రతినిధి హుజూరాబాద్**

ఎస్సీ వర్గీకరణకు ముందు మాల, మాదిగలతో కలపకుండా బేడ బుడగ జంగాల ఉప కులాలను వేరుగా చేర్చి 5శాతం రిజర్వేషన్లు కేటాయించాలని బేడ బుడగ జంగాల జన సంఘం అధ్యక్షులు సిరిపాటి వేణు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హైదరాబాద్ లో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలను సిరిపాటి వేణు ఆధ్వర్యంలో బేడ బుడగ జంగాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించి వినతి పత్రాలను అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని మంత్రులను కోరారు. ఈ సందర్భంగా సిరిపాటి వేణు మాట్లాడుతూ...బె డ బుడగ జంగం ప్రజలం అన్ని రంగాలలో వెనుకబడిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉపకులాల కార్పొరేషన్ను ఏర్పాటు చేసి మాల మాదిగల తర్వాత అధిక సంఖ్యలో ఉన్న బేడ బుడగ జంగాల జాతి బిడ్డకు కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. మంత్రులు తమ సమస్యలను విని సానుకూలంగా స్పందించి ఈ విషయాలను ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేడ బడుగ జంగాల నాయకులు మిరియాల చల్మయ్య, కప్పరి సుధాకర్. కళ్లెం ప్రతాప్, కొండపల్లి సాయికుమార్, కడమంచి చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన విజయోత్సవాలను ప్రజలకు వివరించాలి: KLR

### తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో శ్రేణులకు దిశానిర్ధేశం

### జల్ పల్లికి చెందిన కళ్యాణ్ రావుకు CMRF (LOC) అందజేత.

**మహేశ్వరం నియోజకవర్గం (ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నందున... సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో అమలు చేసినా... చేస్తున్న సంక్షేమ పథకాలను పల్లెపల్లెనా ప్రజలకు వివరించాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి... కాంగ్రెస్ శ్రేణులను కోరారు.తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ్ కాలనీ కి చెందిన కళ్యాణ్ రావుకు రూ. 2.50 లక్షల CMRF (LOC) అందజేశారు KLR.అనంతరం కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు సామాజిక కార్యక్రమాలు ం ఏడాదిలో అమలు చేసిన రూ. 2 లక్షల రుణమాఫీ, ఆడపడుచులకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం, 50వేల కొలువులు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలిండర్, రూ. 500 వరి బోనస్ సహా త్వరలో ఇవ్వనున్న రేషన్ కార్డులు, రైతుబంధును ప్రజలకు వివరించాలని కోరారు.10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయని పథకాలను సీఎం రేవంత్ రెడ్డి గారు చేసి చూపారని కొనియాడారు.కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురావటంలో విఫలమైన బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రుల విమర్శలను తిప్పి కొట్టాలని కిచ్చెన్నగారు పిలుపునిచ్చారు.సమగ్ర కుల గణన సర్వే ద్వారా ప్రతీ పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ కే లక్ష్మీనారాయణ నవీన్ గౌడ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమంలో మలిదశ ఉద్యమానికి విద్యార్థుల్లో నాంది పలికింది శ్రీకాంతచారి

### పోలోజు శ్రీనివాస్ విశ్వకర్మ

**ఎండపల్లి, డిసెంబర్ 03( ప్రజా తీర్పు ప్రతినిధి)**

తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడుగా చరిత్రకెక్కిన కాసోజు శ్రీకాంతాచారి 15 వ వర్ధంతి వేడుకలు మంగళవారం ఎండపల్లి మండల కేంద్రం లోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెల్గటూర్ మండల ఎంఎంసి డైరెక్టర్ పోలోజు శ్రీనివాస్ విశ్వకర్మ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో కెసిఆర్ ముందుండడం ఓ భాగమైతే, ఉద్యమాన్ని పూర్తిగా తన భుజాల పైన వేసుకొని శ్రీకాంతాచారి పోరాటంలో తన సహచర విద్యార్థులతో కలిసి వీరోచిత కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. ఇంత పోరాటం చేస్తున్నప్పటికీ, ఇంకా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యం కాదేమోనని, ఉద్వేగానికి లోనై ఆత్మ బలిదానం చేసుకున్న మొట్టమొదటి విద్యార్థి గా తెలంగాణ చరిత్రలో నిలిచారని అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక అప్పటి కెసిఆర్ ప్రభుత్వం శ్రీకాంతాచారి కుటుంబాన్ని పట్టించుకోకపోవడం అత్యంత హేయనీయమైన చర్య నని ఆయన ఉద్వేగానికి లోనయ్యారు. కానీ ప్రస్తుత ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొనడం గర్వకారణమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీపెల్లి శంకర్,మడుప మనోహర్, కోశాధికారి నాగసముద్రాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మడుప రవి, ప్రచార కార్యదర్శి ఆవుల జయం, నాయకులు తిప్పర్తి సత్యనారాయణ, మడుప బ్రహ్మయ్య, తిప్పర్తి గౌరయ్య, సింహరాజు శ్రీనివాస్,మడుప శ్రీకాంత్, పాములపర్తి సురేష్, చింతల రమేష్,మడుప రాయ్య, మడుప నాగభూషణం,చింతల హరీష్, చొప్పదండి రవిందర్, గొల్లపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.





## పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ మరియు జగదేవపూర్ పోలీసుల దాడి

### 01,04, 833/- రూపాయలు స్వాధీనం

**సిద్దిపేట జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి,**

జగదేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, జగదేవపూర్ పోలీసులు వెళ్లి రైడ్ చేయగా ల08 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 1,04,833/- వేల రూపాయలు, 09 మొబైల్ ఫోన్లు, 1 మోటార్ సైకిల్, 2 కార్లు స్వాధీనం చేసుకున్నారు జగదేవపూర్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. పేకాట ఆడిన వారి వివరాలు1 భీమ్ యెల్లం తండ్రి మల్లయ్య, గ్రామం రిమ్మనగూడ.2 సామల కుమార్ తండ్రి రాములు,గ్రామం మునిగడప3 కర్రే రాము తండ్రి నర్సింలు, గ్రామం రాంపూర్ మండలం చేగుంట4 వట్టిపల్లి శ్రీనివాస్ తండ్రి లక్ష్మణ్, నివాసం జోగిపేట్5 చిత్తరాల యాదగిరి తండ్రి పెంటయ్య, నివాసం జోగిపేట్6 కొంపల్లి నర్సింలు తండ్రి హనుమయ్య,నివాసం జోగిపేట.7 విరపట్నం స్వామి తండ్రి జోగయ్య, నివాసం గొల్లపల్లి8 జెపల్ల రాములు తండ్రి రాజయ్య, నివాసం రిమ్మనగూడ,

**పారిపోయిన వారి వివరాలు**

9 మధు, నివాసం మల్లారం 10 ప్రవీణ్ 11 పోచయ్య నివాసం మల్లారం ఈ సందర్భంగా లిటాస్క్ ఫోర్స్ అధికారులు, గజ్వేల్ పోలీసులు మాట్లాడుతూ గ్రామాలలో, పట్టణాలలో ఫామ్ హౌస్ లలో, ఇళ్ళల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

## ప్రజా పాలన విజయోత్సవాల్లో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 03)**

ప్రజా పాలన ప్రజా విజయవత్సవాల కార్యక్రమాల్లో భాగంగా 3వరోజు మున్సిపల్, జిల్లా యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 2 కే రన్ ను మంగళవారం ఉదయం పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జండా ఊపి ప్రారంభించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు అయ్యి సంవత్సరకాలం పూర్తి చేసుకున్నందున ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్రతి అధికారి జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు అదనపు కలెక్టర్ పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డిఈఓ పి. రామారావు, డి వై ఎస్ ఓ శ్రీకాంత్ రెడ్డి, డిసిఓ రాజమల్లు, తహసిల్దార్ రాజు, గిరిజన క్రీడా అధికారి భుక్యా రమేష్, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# మహారాష్ట్ర ఫలితాలతో డిఫెన్స్‌లో పడిపోయిన రేవంత్ సర్కార్?



## రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వినతి పత్రం

### తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, డిసెంబర్ 03**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హాస్టల్ లపై విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలను విద్యార్థులకు నిజాయితీగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి రిటైర్ ఐఏఎస్ ని మర్యాదపూర్వకంగా రామవరం లో కలిసి వినతి పత్రం అందించిన తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ ఈ సందర్భంగా కోటా శివశంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున అన్ని తరగతుల విద్యార్థులకు మెస్ చార్జీలను కాస్మోటిక్ పెంచిందని పెంచిన మేస్ కాస్మోటిక్ చార్జీలను నిజాయితీగా విద్యార్థులకు అందించాలని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో కాలేజీ ఎటాచ్డ్ హాస్టల్ అనుమతులు తీసుకురావాలని రాష్ట్రవ్యాప్తంగా ఔట్సోర్సింగ్ వ్యవస్థని రద్దుచేసి ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అవుట్సోర్సింగ్ ఉద్యోగస్తులు ఈఎస్ఐ పీఎఫ్ కట్టకుండా చాలా అవినీతి చేస్తున్నారని వీటన్నిటిపై పూర్తి విచారణ నిర్వహించి అందరికీ న్యాయం చేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం కోట శివశంకర్ అన్ని విషయాలపై వివరంగా మాట్లాడుతూ వినతిపత్రాలు అందించడం జరిగింది వినతిపత్రాలు అందించిన వారిలో నాయకులు బత్తిని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారు

### ఆడపిల్ల పెళ్లి చేసిన తల్లిదండ్రుల అందరికీ కాంగ్రెస్ పార్టీ తులం బంగారం బాకీ

**మహేశ్వరం నియోజకవర్గం**
**(ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి. మున్సిపాలిటీ పరిధిలో ప్రీమియర్ ఫంక్షన్ హాల్ లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న లిమాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారు ఈ కార్యక్రమంలో మొత్తం 230 చెక్కులు షాది ముబారక్ 201, కల్యాణ లక్ష్మి 30 చెక్కులు పంపిణీ చేశారు ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన వచ్చి సంవత్సరం గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన మాట ఏడ వేసిన గొంగడి ఆడనే ఉందని ఆడపిల్ల పెళ్లి చేసిన ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం బాకీ ఉందని సబితా ఇంద్రారెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల్ ఎమ్మార్వో ఇందిరా దేవి, జల్ పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్ రామ్, చైర్మన్ అబ్దుల్లా సాది వైస్ చైర్మన్ పరానా బేగం ఈ సూప్ పటేల్ కోఆప్షన్ సభ్యులు సూర్ రెడ్డి కృష్ణారెడ్డి కౌన్సిలర్ షేక్ అఫ్జల్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల జనార్ధన్ మరియు నాయకులు మహిళలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు పాల్గొన్నారు.




## బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్‌లో ప్రజా విజయోత్సవ వేడుకలు

**మహేశ్వరం నియోజకవర్గం**
**(ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)..**

మహేశ్వరం నియోజకవర్గం బడంపేట్ నగర పంచాయతీ పరిధిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమాలలో పాల్గొన్న లిటిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గారులి. సిరిపురం యాదయ్య మున్సిపల్ గ్రౌండ్ నుండి కార్పొరేషన్ కార్యాలయం వరకు శానిటేషన్, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించారు అనంతరం ఉత్తమ శానిటేషన్ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేసి,ప్రభుత్వం విడుదల చేసిన 3 కోట్ల రూపాయల చెక్కును స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ని సందర్శించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించి శానిటేషన్ సిబ్బంది తప్పక పరీక్షలు చేయించుకోవలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.సరస్వతి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, డీఈఈ నర్సింహ రాజు, ఏఈ వినీల్ గౌడ్, మేనేజర్ నాగేశ్వరరావు, ఆర్వో వేణుగోపాల్ రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ యాదగిరి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, సుభాన్ యాదవ్, వెంకటేష్ గౌడ్, బంగారి అశోక్, దిండు శ్రీనివాస్ గౌడ్, అమృత నాయుడు, రమేష్ గౌడ్, గిరి ముదిరాజ్, భాను తదితరులు పాల్గొన్నారు.

### ఆరు అబద్ధాలు...66 మోసాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ !

### ఏడాది కాకముందే మసకబడుతున్న కాంగ్రెస్ ప్రతిష్ట

### తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా గెలిచేది బిజెపినే !

### భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత గంగిశెట్టి రాజు వెల్లడి



**తిరునగరి ఆంజనేయస్వామి ప్రజాతీర్పు ప్రతినిధి హుజురాబాద్**

సంవత్సరకాలం పూర్తి కాకముందే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని... ఏ వర్గాన్ని కదిపినను ఈ ప్రభుత్వం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారని... గత పది ఏళ్ల టిఆర్ఎస్ ప్రభుత్వానికి... ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనలో ఏ మాత్రం తేడా లేదని... ఈ రెండు పార్టీలు దోచుకోవడానికి... దాచుకోవడానికి అధిక ప్రాధాన్యత నిస్తూ రాష్ట్ర అభివృద్ధిని ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని... ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగిన ను... రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బిజెపి సీనియర్ నేత... యువ నాయకుడు... భారతీయ జనతా పార్టీ హుజురాబాద్ పట్టణ శాఖ అధ్యక్షులు గంగిశెట్టి రాజు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఈరోజు హుజురాబాద్ కమలాపూర్ మండలాలలో... అలాగే దాదాపు 40 గ్రామాల మీదుగా గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలో భారీ ఎత్తున జరిగిన బైక్ ర్యాలీకి అనూహ్య స్పందన లభించింది. పార్టీ శ్రేణులు... ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు... సీనియర్ నాయకులు... పార్టీకి అనుబంధంగా ఉన్నటువంటి వివిధ విభాగాలకు చెందిన ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావడంతో బైక్ ర్యాలీ ఆలస్యంగా హుజురాబాద్ పట్టణానికి చేరుకున్నది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను... హాజరైన అన్ని వర్గాల ప్రజలను ఉద్దేశించి గంగిశెట్టి రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అబద్దాలను అస్త్రంగా చేసుకోవడం వల్లనే పగ్గాలు చేపట్టిందని ఆరోపించారు. ఆరు అబద్ధాలు... 66 మోసాలను పదేపదే చెప్పి ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టించిందని... అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క వాగ్దానాన్ని సమర్థవంతంగా అమలు చేయలేక రేవంత్ రెడ్డి సర్కార్ చేతులెత్తేసిందని ధ్వజమెత్తారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన అబద్ధాలు... మోసాలకు తోడుగా 420 హామీలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను దారుణంగా ఈ ప్రభుత్వం మోసగించిందని... ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్న ప్రతి సందర్భంలోనూ రాజకీయాన్ని పక్కదారి పట్టించడానికి ఇతర సమస్యలను తెరమీద తీసుకువచ్చి ఈ ప్రభుత్వం పబ్బం గడుపుకుంటున్నదని... ఇదంతా తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉన్నదని గంగిశెట్టి రాజు తెలిపారు. గత సంవత్సర కాలంగా ప్రభుత్వాన్ని విమర్శించకుండా తమ పార్టీ మంచైనా... చెడైనా... ఇన్నాళ్లుగా సహకరించుకుంటూ వస్తున్నదని... కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచినప్పటికీ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఇకముందు కూడా పాలన కొనసాగించలేదన్న విషయం అర్థం చేసుకున్న తమ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇకముందు దశలవారీగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరును ఎండగట్టాలని రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకున్నట్లు రాజు వెల్లడించారు. అందులో భాగంగా ఇకపై తరచుగా రాష్ట్రస్థాయిలో అనేక ఉద్యమాలను చేపట్టాలని పార్టీ ఒక క్యాలెండర్ ను... రూపొందించినట్లు చెప్పారు. వ్యవసాయదారులు... మహిళలు.. నిరుద్యోగులు... రైతు కూలీలు... ఉద్యోగులు... పదవి విరమణ చేసిన ఉద్యోగులు... మేధావులు ఇలా అన్ని వర్గాల నుండి ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన అభిప్రాయాలను స్వీకరించి... ఆ అభిప్రాయాలపై రాష్ట్రస్థాయిలో చర్చించి నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని గంగిశెట్టి రాజు తెలిపారు. పార్టీ కార్యక్రమాలు ఇకముందు చాలా సీరియస్ గా జరుగుతాయని... ప్రతి ఒక్కరూ హోదాలకు... సీనియారిటీకి అతీతంగా పార్టీ చేపట్టే కార్యక్రమాలలో కచ్చితంగా పాల్గొనవలసి ఉంటుందని చెప్పారు. మొన్నటి మహారాష్ట్ర ఫలితాలతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం లో అలజడి మొదలైందని... ఈ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని ఆయన జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులపై... శాసనసభ్యులపై... ఎమ్మెల్యేలపై... ఎమ్మెల్సీలపై... పార్లమెంటు సభ్యులపై... పార్టీ సీనియర్ నేతలపై ఏమాత్రం పట్టులేదని... ఒక సమస్యపై కాంగ్రెస్ లోనే భిన్నభిప్రాయాలు ఉన్నట్లు లక్ష ఉదాహరణలు చెప్పుకోవచ్చని.... టిఆర్ఎస్ ప్రభుత్వం స్థానంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు... అలాగే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ఆశించిన వారికి... ఏడాది గడవక ముందే నిరాశ ఎదురైందని గంగిశెట్టి రాజు వివరించారు. త్వరలోనే భారతీయ జనతా పార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షులుగా నూతన నేతను ఎన్నుకోవడానికి కేంద్ర నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే ఖచ్చితంగా తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని... ఈ విషయం తమ పార్టీ కానీ.. తమ పార్టీ నేతలు కానీ చెబుతున్న విషయం కాదని... ఇది ముమ్మాటికి ప్రజల నుండి వినిపిస్తున్న సంకేతమని గంగిశెట్టి రాజు అభిప్రాయపడ్డారు. ఈరోజు జరిగిన బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంత చేసిన పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి రాజుతోపాటు జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు.. జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్.. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు.. జిల్లా కార్యదర్శి నరసింహారాజు.. పార్టీ సీనియర్ నేత.. కౌన్సిలర్ వెంకటరెడ్డి.. నల్ల సుమన్ జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ అశోక్ వీణవంక మండల శాఖ అధ్యక్షులు ఆదిరెడ్డి నరాల రాజశేఖర్... పార్టీ సీనియర్ నేత... తుమ్మలపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి... గంగిశెట్టి ప్రభాకర్.. తూర్పాటి రాజు.. అలాగే బూత్ కమిటీ అధ్యక్షులు జిల్లా పదాధికారులు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### దుబ్బమల్లన్న జాతరలో "ప్రణవ్"

### వైభవంగా పెద్దపట్నం,కళ్యాణ కార్యక్రమాలు

### ఘనంగా స్వాగతం పలికిన అధికారులు,నాయకులు

**ప్రజాతీర్పు ప్రతినిధి హుజూరాబాద్**

తెలంగాణలో గల దేవాలయాల విషయంలో తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నదని... ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజల సౌకర్యార్థం ఆలయాలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వ అడుగులు వేస్తున్నదని... ఈ విషయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రత్యేకమైన ప్రణాళికను రూపొందించినట్లు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్... యువ కాంగ్రెస్ నేత ప్రణవ్ బాబు వెల్లడించారు. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోల్చి చూస్తే తెలంగాణ ప్రజలలో భక్తి భావం అధికమని... మరియు ముఖ్యంగా చెప్పాలంటే గ్రామీణ ప్రాంతాలలో స్థానికంగా ఉన్నటువంటి అమ్మవార్లను ఆరాధించడానికి గ్రామీణ ప్రజలు అనునిత్యం ఆరాటపడుతుంటారని చెప్పారు. ఏడాది పొడవునా లక్షల సంఖ్యలో హాజరయ్యే దేవాలయాల విషయంలో గత ప్రభుత్వాలు అంతగా శ్రద్ధ చూపలేదని... రాష్ట్రంలోని అనేక దేవాలయాలు సమస్యల వలయంలో కొట్టుమి ట్టాడుతున్నాయని... ఆర్థిక భారాన్ని లెక్కచేయకుండా గ్రామీణ ప్రజల ఆశలు... ఆశయాల కలుగునంగా ప్రతి దేవాలయాన్ని తీర్చిదిద్దడమే ప్రభుత్వం ముందున్న కర్తవ్యం అని ప్రణవ్ బాబు పునరుద్ఘాటించారు. అత్యంత మహిమ కలిగి కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం,మినీ కొమరవెల్లిగా పేరుగాంచిన దుబ్బ మల్లన్న ఆలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.సోమవారం ఈరోజున జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో గల దుబ్బ మల్లన్న ఆలయంలో జరిగే పెద్దపట్నం కార్యక్రమానికి ఆయన హాజర య్యారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు, నాయకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని త్వరలోనే ఆలయ కమిటీలు నియ మించి దేవాలయల అభివృద్ధికి మరింత తోడ్పాటును అందిస్తామని అన్నారు.ఇటీవల వేములవాడకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నిధులే ఇందుకు నిదర్శనమని అన్నారు.కాగా అని ఆలయంలో వేసిన పెద్దపట్నం అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## బడంగ్ పేట కార్పొరేషన్‌లో హైడ్రా

### అల్మాస్ గూడలో పార్క్ ఆక్రమణలు తొలగింపు

### త్వరలో మరిన్ని పార్కులకు మోక్షం: అధికారులు.

**మహేశ్వరం నియోజకవర్గం (ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

బడంగ్ పేట కార్పొరేషన్‌లో పార్కులను ఆక్రమించిన అక్రమార్కులపై కొరడా ఝులిపిస్తోంది హైడ్రా. అల్మాస్ గూడ 5వ డివిజన్ లోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో పార్కు స్థలాన్ని దర్జాగా కబ్జా చేసి కంటైనర్ ఏర్పాటు చేశాడు ఓ ఘనుడు.ఈ విషయంపై కాలనీ వాసులు రెండ్రోజుల క్రితం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి దృష్టికి తెచ్చారు. అంతకు ముందు కమిషనర్, హైడ్రా, పోలీసులకు ఫిర్యాదు చేసిన లేఖలను లక్ష్మారెడ్డికి అందజేశారు.హైడ్రా, పోలీస్, మున్సిపల్ ఉన్నతాధికారులతోKLR మాట్లాడి భూకబ్జాలపై ఉక్కుపాదం మోపాలని కోరారు. దీంతో తెల్లవారుజామున హైడ్రా, మీర్పేట్ పోలీసులు సంయుక్తంగా పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్ ను ధ్వంసం చేసి... చిన్నారులు ఆడుకునే వస్తువులను ఏర్పాటు చేశారు. పార్కుస్థలాన్ని కాపాడిన కేఎల్ఆర్‌కు, హైడ్రా, పోలీసు అధికారులకు వెంకటేశ్వర కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. బడంగ్ పేట కార్పొరేషన్ లో కబ్జాకు గురైన పార్కు స్థలాలపై ఫిర్యాదులు అందాయని త్వరలో వాటిపైనా చర్యలు తీసుకుంటామని హైడ్రా ఇన్స్పెక్టర్ హెచ్చరించారు.

# వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను అత్యవసరంగా కలిసిన సబ్బని వెంకట్

## తక్షణమే గుండె వైద్య నిపుణుడిని నియమించాలని విన్నపం

## గుండెపోటుతో మరణిస్తున్న స్పందించేవారు లేరిక్కడ

## ప్రజా సమస్యలు గాలికి.. పనికిరాని రాజకీయాలు తెరమీదికి?

## త్వరలో గుండె వైద్య నిపుణుడిని నియమిస్తానని హామీ ఇచ్చిన మంత్రి

## హుజురాబాద్ మీడియాతో వివరాలు వెల్లడించిన సబ్బని వెంకట్



**తిరునగరి ఆంజనేయస్వామి ప్రజాతీర్పు ప్రతినిధి హుజురాబాద్**

తమకంటూ ఒక గుర్తింపును పొంది... హుజురాబాద్ ప్రాంతంపై చెరగని ముద్ర వేసుకున్న సీనియర్ జర్నలిస్ట్... ప్రముఖ న్యాయవాది బాణాల శ్యాంసుందర్... అదేవిధంగా రాజకీయాలలో రాటు తేలిన తుమ్మేటి సమ్మిరెడ్డి లాంటివారు గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం... ఇదేవిధంగా ఇంకేంతోమంది ఇదే కారణంతో మన మధ్య నుండి దూరమైనప్పటికీ పాలకులు స్పందించకపోవడం క్షమించరాని విషయమని... జమ్మికుంట... హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులలో గుండె వైద్య నిపుణులు లేకపోవడం వల్ల ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని... తక్షణమే హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణుడిని తక్షణమే నియమించాలని కోరుతూ ప్రభుత్వ సామాజికవేత్త... రక్తదాన ప్రధాత... హుజురాబాద్ మండలానికి చెందిన సబ్బని వెంకట్ మంగళవారం సాయంత్రం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆయన ఛాంబర్ లో కలుసుకొని వినతిపత్రాన్ని సమర్పించినట్లు ఆ తర్వాత హుజురాబాద్ మీడియాకు వెంకట్ ఈ వివరాలను వెల్లడించారు. స్థానికంగా గుండె వైద్య నిపుణుడు ఉన్నట్లయితే బాణాల శ్యాంసుందర్... తుమ్మేటి సమ్మిరెడ్డి లాంటివారు మన మధ్య ఉండేవారని... అత్యవసర పరిస్థితులలో స్థానికంగా వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల ఇలాంటి గు మరణాలు హుజురాబాద్ పాత తాలూకాలో అనేక జరుగుతున్నాయని వెంకట్ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి... జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి రంగురంగులతో అలంకరించబడి... ఫర్నిచర్ తో ముస్తాబు అయినప్పటికీ లోనలోటారం... పైన పటారం అన్నట్లుగా అతి ముఖ్యమైన విభాగాలకు చెందిన డాక్టర్లు లేకపోవడం వల్ల జరగవలసిన నష్టం జరుగుతూనే ఉన్నదని... ఈ కారణంగా ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడిన ఉదంతాల గురించి మంత్రికి గు సమర్పించిన వినతి పత్రంలో గు పేర్కొన్నట్లు వెంకట్ వివరించారు. వైద్యరంగం రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఆచరణలో చూస్తే నేను రాను బిడ్డో... సర్కారు దవాఖానకు అన్న పాత తరం రోజులే హుజురాబాద్... జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రులను చూస్తే అవగతం అవుతున్నదని ఈ సందర్భంగా సబ్బని వెంకట్ వ్యాఖ్యానించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహను కలిసినప్పుడు ఆయన తాను చెప్పిన అన్ని విషయాలను సావధానంగా విన్నారని... ఈ విషయంలో తాను తప్పకుండా స్పందించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వెంకట్ వెల్లడించారు. హుజురాబాద్ పట్టణానికి కరీంనగర్.. వరంగల్ జిల్లాలు కేవలం 30-35 కిలోమీటర్ల పరిధిలోని ఉన్నప్పటికీ గుండెపోటు లాంటి సీరియస్ కేసుల సమయంలో స్థానికంగా అత్యవసర చికిత్స జరిపించి... ఆ తరువాత ఇటు వరంగల్ కు కానీ... అటు కరీంనగర్కు గాని బాధితులను పంపించినట్లయితే ఫలితం ఉంటుందని... కానీ జమ్మికుంట హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులలో గుండె వైద్య నిపుణులు లేకపోవడం వల్ల అత్యవసరంగా చికిత్స లభించడం లేదని... ఈ కారణంగా జరగవలసిన నష్టం జరిగిపోయి అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని... బాహ్య ప్రపంచానికి తెలియకుండా ఇలాంటి ఘటనలు తరచుగా ఎన్నో జరుగుతూనే ఉన్నాయని సబ్బని వెంకట్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కి వివరించారు. వాస్తవానికి హుజురాబాద్ ప్రాంత అభివృద్ధి విషయంలో ఇటు ప్రతిపక్షానికి.. అటు అధికార పక్షానికి మొదటి నుండి ఏమాత్రం చిత్తశుద్ధి లేనేలేదని... ప్రతి ఎన్నికల సందర్భంగా హామీలు గుప్పించడం తప్ప ఆ తర్వాత ప్రజలకు సంబంధించిన కనీస మౌలిక సదుపాయాల విషయంలో ఏ నాయకుడు ఇంతవరకు ప్రత్యేక శ్రద్ధ చూపలేదని ఆయన ఆరోపించారు. చిన్న చిన్న విషయాలను భూతద్దంలో చూపెడుతూ వాటిని రోజుల తరబడిగా రాద్ధాంతం చేస్తూ రాజకీయ లబ్ధి పొందడానికే హుజురాబాద్ ప్రాంత నాయకులు అలవాటు పడ్డారని... అన్ని హంగులు ఉండి కూడా ఎందుకు హుజురాబాద్ ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదో ఏ ఒక్కరూ ఆలోచించడం లేదని సబ్బని వెంకట్ విమర్శించారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడానికి... కళ్యాణ లక్ష్మి... షాదీ ముబారక్ లాంటి చెక్కులను అందించడానికి ఈ ప్రాంత నేతలు పోటీలు పడుతున్నారే తప్ప దీర్ఘకాలికంగా ఈ ప్రాంత ప్రజలకు... విద్యార్థిని విద్యార్థులకు... వ్యవసాయదారులకు అవసరమయ్యే శాశ్వతమైన అవసరాల గురించి ఏ ఒక్కరు ఆలోచించడం లేదని ఆయన విమర్శించారు. కేవలం ప్రభుత్వ నుండి వచ్చే చెక్కులను పంపిణీ చేయడానికి ప్రజలు ఎమ్మెల్యేలను... మంత్రులను ఎన్నుకోలేదని... బాధ్యత గల ప్రజాప్రతినిధులు చట్టసభలలో కూర్చుండి ప్రజా సమస్యలపై గళం ఎత్తకుండా అక్కరకురాని విషయాలకు ప్రాధాన్యతనిస్తూ విలువ గల సమయాన్ని వృధా చేస్తుండడం క్షమించరాని విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నుండి వచ్చే చెక్కులను పంపిణీ చేయడానికి గ్రామస్థాయి కార్యదర్శులు కూడా ఉన్నారని వెంకట్ గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయో... డాక్టర్ల కొరత ఏ స్థాయిలో ఉన్నదో తెలుసుకోవడం కోసం మొన్నటికి మొన్న సబ్బని వెంకట్ జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి పత్రికా ముఖంగా ఈ ప్రాంత నేతల పనితీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన విషయం విధితమే. రాజకీయాలలోకి రావాలనే ఉత్సాహంతోనే మీరు ఇదంతా చేస్తున్నారా అని మీడియా పదే పదే ప్రశ్నించగా... తాను హుజురాబాద్ ప్రాంత వాసిగా... సామాజిక సేవ రంగం పట్ల మక్కువ గలిగిన పౌరుడిగా ఇలా స్పందిస్తున్నానని... పదవుల కోసం... రాజకీయాల కోసం ఏ మాత్రం ఆలోచించకుండా ఒక సామాన్య పౌరుడిగా ప్రజల పక్షాన నిలిచి పోరాడుతున్నానని... ఇకముందు కూడా ఇలాగే స్పందిస్తానని సబ్బని వెంకట్ మీడియా అడిగిన ప్రశ్నలకు పై విధంగా సమాధానం ఇచ్చిన విషయం తెలిసిందే.



## కేంద్ర మంత్రివర్యులు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి గారికి భూనిర్వాసితుల వినతి

### రైతుల పక్షాన పోరాడుతాం – కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**మహేశ్వరం నియోజకవర్గం (ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)**

మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలంలో రూపుదిద్దుకోనున్న ఫ్యూచర్ సిటికై ఏర్పాటు కానున్న 300 ఫీట్ల రోడ్డు కోసం భూములను కోల్పోతున్న రైతులు ఈరోజు ఉదయం లికేంద్ర మంత్రివర్యులు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డిలి గారిని వారి నివాసంలో కలిసి తమ ఆవేదనను తెలియజేస్తూ, తమకు అండగా నిలబడాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి రెడ్డి గారు మాట్లాడుతూ రైతులకు ఇష్టం లేకుండా భూసేకరణ చేపట్టే అధికారం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, రైతులు ఎవరూ కూడా అధైర్య పడొద్దని వారికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లిబొక్క నరసింహారెడ్డిలి గారు, లిబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్లి గారు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట్ రెడ్డి గారు, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు అమరేందర్ రెడ్డి, మాదారం రమేష్ గౌడ్, వెంకటేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.



## శ్రీ రామ మందిర ప్రాణ ప్రతిష్ట మహోత్సవం

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 03)**

ముధోల్ మండలం అష్ట గ్రామంలో శ్రీ రామ మందిరం ప్రాణ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు కన్నుల పండుగగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే వేడుకల్లో భాగంగా మొదటి రోజు గణపతి పూజ-యాగశాల ప్రవేశం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. బాసర ఆలయ అర్చకులు మురళి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం విగ్రహాలతో పాటు శ్రీ రామ లక్ష్మణ -ఆంజనేయ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. శోభాయాత్రలో కనుక రాజు పద్మశ్రీ గ్రహీత బృందం సభ్యుల గుస్సాడి నృత్యం ప్రత్యేక ఆకర్షణ నిలిచింది గుస్సాడీ నృత్యాన్ని తిలకించేందుకు చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ తరలివచ్చారు. గుస్సాడీ నృత్యానికి రావుల శ్రీనివాస్ 42 వేలు అందించారు. ఆలయ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో కనివిని ఎరగని రీతిలో యాగశాల నిర్మాణం మూడు రోజుల పాటు భాజా భజంత్రీలతో పూజలు- సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ కమిటీ వైస్ చైర్మన్ నల్ల సుకన్య రమేష్, మాజీ సర్పంచ్ అశోక్, రావుల పోశట్టి, మాజీ ఎంపీటీసీ సునీత పోశట్టి, విడిసి సభ్యులు మెరుగు లక్ష్మారెడ్డి, బలగారి ముత్యం, ముసుగు మోహన్ రెడ్డి, మురళి, బొంగు సాయిలు, విశ్వకర్మ సంఘం సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకి బాటలు వెయ్యాలి

### రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, డిసెంబర్ 03**



ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను సాధించే విధంగాబాటలు వెయ్యాలి అని అన్నారు.మంగళవారం రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకు నూరు మురళి అశ్వాపురం మండలం గొంది గూడెం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, వసతి గృహం, మణుగూరు జడ్పీ హెచ్ఎస్ పాఠశాల అశోక్ నగర్ ఎంపీపీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొందిగూడెం గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్లలో ట్యాప్లు లీకేజీను గుర్తించి రిపేరు చేయించాల్సిందిగా ఆదేశించారు. విద్యార్థులకు ఒకే రకమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజ నం అందించాలన్నారు. మణుగూరు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో వంటశాల తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏ విధంగా బోధిస్తున్నారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎనిమిదో తరగతి తెలుగు మీడియం గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. ఉన్నత చదువులు చదవాలంటే ఇంగ్లీష్ మీడియం ఇంగ్లీష్ లో పట్టు సాధించా లని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులతో మీటింగ్ నిర్వహించి పాఠశాలలో బైలింగ్ వెల్ విధానం, పాఠశాలల్లో సెమిస్టర్ పరీక్ష విధానం విద్యార్థుల్లో చదవడం వ్రాయడంలో నైపుణ్యం సాధించుటకు తీసుకోవలసిన చర్యలపై అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో వివిధ పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ జరిగి విద్యార్థులు అనారోగ్యం పాలు అవ్వడాన్ని తెలంగాణ విద్యా కమిషన్ సీరియస్ గా తీసుకుందని,అదేవిధంగా రాష్ట్రంలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంలో భాగంగానే రాష్ట్రంలో విద్యార్థులకు సమగ్ర విద్యను అందించుటకు గాను నూతన విద్యా విధానం అమలు చేయడానికి తీసుకోవలసిన చర్యల గురించి రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి అందరి అభిప్రాయాలు సేకరిస్తున్నామని, ఇది విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏదో ఒక నిర్ణయం తీసుకోకుండా ప్రపంచవ్యాప్తంగా, ప్రవేట్ పాఠశాలల్లో,కార్పొరేట్ విద్యాసంస్థల అనుసరిస్తున్న విధానాన్ని పరిగణలోనికి తీసుకొని దీని ద్వారా రానున్న రోజుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వం యొక్కలక్ష్యం అని అన్నారు.ఈ తనిఖీలలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి దాసరి అనసూయ, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిరా, మహిళా శిశు సంక్షేమ అధికారి లెనినా, కేబీవీపీ అధికారిని అన్నామలై ఎంఈఓ స్వర్ణ జ్యోతి, హెడ్మాస్టర్ జి.నాగశ్రీ, ఉపాధ్యాయులు విద్యార్థులుపాల్గొన్నారు.



## వ్యవసాయ కార్మిక సంఘం సమావేశాలను జయప్రదం చేయండి

### రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పుబ్యూరోకరీంనగర్ డిసెంబర్ 03)**

ఈ నెల 7,8 తేదీల్లో శంషాబాద్ లో జరుగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాన్ని నిర్మాణ పరంగా బలోపేతం చేసేందుకు ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం, సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం అమలు కోసం భవిష్యత్తులో పోరాటాలకు రూపకల్పన చేసేందుకు క్షేత్ర స్థాయిలో సంఘ సభ్యత్వం పెంపోదించు కోవాడానికి గ్రామ, మండలాల వారిగా కమిటీలు వేసుకొనేందుకు వ్యవసాయ కూలీలకు భీమా సౌకర్యం తోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఇచ్చే విదంగా పోరాటాలు రూపొందిస్తామని అన్నారు.రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల మొదటి రోజున బికెయంయు రాష్ట్ర కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ బాలమల్లేష్ సంతాప సభ జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ కార్యదర్శి నిర్మల్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబాశివ రావు హాజరువుతున్నారని అన్నారు మొదటి రోజు జరిగే బాల్లమల్లేష్ సంతాప సభకు వందలాదిగా కార్యకర్తలు తరలివచ్చి సంతాప సభను జయప్రదం చేయాలని సృజన్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బోయిని అశోక్ జిల్లా ఆఫీస్ బేరర్స్ దరిపల్లి అంకుస్, విలాసాగరం అంజయ్య, ఎగుర్ల మల్లేశం, గట్టు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

### హుజురాబాద్‌లో దివ్యాంగుల కార్యాలయం కోసం కృషి చేస్తా

### యువ కాంగ్రెస్ నేత ప్రణవ్ బాబు వెల్లడి

**తిరునగరి ఆంజనేయ స్వామి ప్రజాతీర్పు ప్రతినిధి హుజూరాబాద్**



దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ విడుదల ప్రణవ్ అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రణవ్ కు స్థానిక నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ.. .దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది, దాంట్లో భాగంగానే దివ్యాంగుల కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేసిందన్నారు. దివ్యాంగులకు రావలసిన హక్కులను పూర్తిస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. దివ్యాంగ సమాచారం వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవుల శ్రీనివాసు మాట్లాడుతూ.. పుట్టుకతో దివ్యాంగులే అయినా కానీ సకలాంగులకు ఏమాత్రం తీసుకొని విధంగా అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగుతున్నారని తెలిపారు. సరికొత్త నైపుణ్యాలతో అనేక రంగాల్లో దివ్యాంగులు ప్రతిభ కనబరుస్తున్నారని ప్రభుత్వం గుర్తించి మరింత ప్రోత్సహించాలని కోరారు. వికలాంగులకు ఎలాంటి అసౌకర్యాలు కలిగించే విధంగా ప్రవర్తించకూడదని తోటి సోదరులుగా కుటుంబ సభ్యులుగా భావించాలన్నారు. వికలాంగులు కేవలం లోపాల కారణంగా తల్లిదండ్రులపై బంధువులపై ఇతరులపై ఆధారపడుతున్నారే తప్ప సకలాంగులతో అన్ని రంగాలలో దీటుగా నడుస్తున్నారని తెలిపారు. దివ్యాంగులలో కూడా సమాజాన్ని సరైన బాటలో నడిపించే గురువులు గాను తల్లిదండ్రులు గాను సైంటిస్టులుగాను మెకానికల్ గాను ఆర్టిస్టులు గాను మరెన్నో రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. వికలాంగుల పట్ల చిన్నచూపు చూడడం తగదని వీలైతే వారికి చేయూతనిచ్చి వారి ప్రతిభను గుర్తించి వారి జీవనోపాధికి జీవనాభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఎలాంటి పనులు చేసుకోలేక జీవనోపాధిని కల్పించుకోలేక కేవలం పింఛన్ మీదనే ఆధారపడి పింఛను వస్తేనే ఇల్లు గడిచే పరిస్థితి నెలకొందని గుర్తు చేశారు. అలాంటి వారికి పింఛన్లు సరైన సమయాలలో రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఇల్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఉపకరణాలను అందించాలని, ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని, దివ్యాంగులు అయినందువల్ల కిందిస్థాయిలో గల ఇండ్లను కేటాయించి వారిని ఆదుకోవాలని వేడుకున్నారు. చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు చదువు లేని వారికి పెన్షన్లు మంజూరు చేయవలసిందిగా కోరారు. ఆరోగ్యారెంటీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లుగా దివ్యాంగులకు కూడా బస్సు పాసులు పంపిణీ చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా 6000 రూపాయల పెన్షన్ వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి దివ్యాంగ సమాచారం వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవుల శ్రీనివాస్, హైదరాబాద్ మండల దివ్యాంగుల కమిటీ అధ్యక్షులు కంకణాల రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు వలబోజు పర బ్రహ్మచారి, ఉపాధ్యక్షులు స్వప్న రాజిరెడ్డి ప్రధాన కార్యదర్శి కట్కూరి రవీందర్ కోశాధికారి మొగిలి సహాయ కార్యదర్శి రుద్రాల క్రాంతి కుమార్ గోరేమియా రాజిరెడ్డి వెంకటరమణ శ్రీకాంత్ భాస్కర్ లింగారెడ్డి సంపత్ అమరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రేసు రసవత్తరం.. డబ్ల్యూటీసీలో మారిన ఫైనల్ సమీకరణాలు

ముంబై: వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 సైకిల్‌లో టెస్టులు ముగుస్తున్న కొద్దీ ఫైనల్ రేసు మరింత రసవత్తరమవుతోంది. టాప్-2లో నిలిచేందుకు ఏకంగా ఐదు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మరో 15 టెస్టులు మిగిలున్న ఈ సైకిల్‌లో ఇప్పటి వరకూ ఏ ఒక్క జట్టూ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకోలేదు. ప్రస్తుతం టీమ్‌ఇండియా అగ్రస్థానంలో కొనసాగుతున్నప్పటికీ రాబోయే టెస్టులలో గెలవడం ఆ జట్టుకు కీలకం. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్.. ఫైనల్ బెర్తు కోసం పోటీ పడుతున్నాయి. భారత్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన కివీస్.. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను ఓడటం.. పెర్త్ టెస్టులో భారత్ భారీ విజయం, దక్షిణాఫ్రికా.. శ్రీలంకను చిత్తుగా ఓడించిన నేపథ్యంలో ఫైనల్ సమీకరణాలు మళ్లీ మారాయి.



### భారత్‌కు మంచిదే..

స్వదేశంలో కివీస్ చేతిలో క్లీన్‌స్వీప్ ఎదుర్కొని ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లే ముందు డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే భారత్ కచ్చితంగా 4-0తో సిరీస్‌ను గెలవాల్సిన పరిస్థితి. కానీ పెర్త్ టెస్టులో 295 పరుగుల తేడాతో గెలిచి రోహిత్ సేన డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో మళ్లీ 61.11 శాతంతో అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. ఈ సైకిల్‌లో మరో 4 మ్యాచ్‌లు ఆడనున్న భారత్.. సిరీస్‌ను 4-1, 3-0తో గెలిచినా.. 2-2తో డ్రా అయినా ఫైనల్ చేరే అవకాశాలున్నాయి. ఆస్ట్రేలియాను 3-0తో ఓడిస్తే భారత్.. 62.28 పాయింట్లతో డబ్ల్యూటీసీని ముగిస్తుంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2-2తో డ్రా అయినా టీమ్‌ఇండియా ఫైనల్ చేరుతుంది. అయితే ఇలా జరగాలంటే శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌ను దక్షిణాఫ్రికా 2-0తో గెలవాలి. ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగే రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను శ్రీలంక.. 1-0తో గెలిస్తే భారత్ మూడోసారి ఫైనల్ చేరడానికి ఆస్కారముంటుంది.

### రేసులోకి వచ్చిన సఫారీలు..

దర్బన్ టెస్టులో లంకను చిత్తుచిత్తుగా ఓడించడం దక్షిణాఫ్రికాకు కలిసొచ్చింది. ప్రస్తుతం ఆ జట్టు భారత్ తర్వాత 59.26 శాతం పాయింట్లతో రెండో స్థానాన నిలిచింది. ప్రస్తుత సైకిల్‌లో ఆ జట్టు శ్రీలంకతో మరో టెస్టు, పాకిస్థాన్‌తో రెండు (రెండూ స్వదేశంలోనే) ఆడాల్సి ఉంది. ఈ మూడింటిలో రెండు గెలిస్తే టాప్-2లో (ఆస్ట్రేలియా ఫలితాలపై ఇది ఆధారపడి ఉంటుంది) నిలుస్తుంది. ఒకవేళ భారత్.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని దక్కించుకుని.. స్వదేశంలో శ్రీలంక, ఆస్ట్రేలియాను మట్టికరిపిస్తే అప్పుడు టాప్-2 జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొనే అవకాశముంది.

### ఆసీస్‌కు సంకట స్థితి..

పెర్త్ టెస్టు ఓటమి, సఫారీల భారీ గెలుపుతో ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు దెబ్బతిన్నాయి. ఈ సైకిల్‌లో కంగారూలు మరో ఆరు మ్యాచ్‌లు (ఇండియాతో 4, శ్రీలంకతో 2) ఆడాల్సి ఉంది. వీటిలో నాలుగు మ్యాచ్‌లు గెలిస్తే ఇతర ఫలితాలతో సంబంధం లేకుండా ఆ జట్టు వరుసగా రెండోసారి ఫైనల్ చేరుతుంది. భారత్‌తో సిరీస్‌ను 3-2తో కోల్పోయినా శ్రీలంకను 2-0తో ఓడిస్తే ఆ జట్టు టాప్-2లో నిలుస్తుంది. కానీ స్పిన్ పిచ్‌లపై లంకేయులను నిలువరించడం అంత తేలిక కాదు.



## మెరిసిన వరంగల్ బాక్సర్లు 68వ ఎస్‌జీఎఫ్‌ఐ బాక్సింగ్ టోర్నీ

హనుమకొండ జేఎన్‌ఎస్‌లో 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) బాలికల అండర్-19 బాక్సింగ్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మంగళవారంతో ముగిసిన టోర్నీలో వరంగల్ బాక్సర్లు సత్తాచాటారు. 45 కేజీల విభాగంలో నిఖిత(రంగారెడ్డి, స్వర్ణం), కావ్య(వరంగల్, రజతం), 45-48 కేజీల విభాగంలో కార్తీక(వరంగల్, స్వర్ణం), సంజన(ఖమ్మం, రజతం), 48-51 కేజీల విభాగంలో శ్రీలేఖ(మహబూబ్‌నగర్, స్వర్ణం), అనూష(హైదరాబాద్, రజతం), 57-60 కేజీల విభాగంలో నవ్య(వరంగల్, స్వర్ణం), సుభంగి సవేర్(హైదరాబాద్, రజతం), 60-64 కేజీల విభాగంలో ఖైతీజా బేగం(హైదరాబాద్, స్వర్ణం), లక్ష్మీప్రసన్న(వరంగల్, రజతం) పతకాలు సాధించారు. మొదటి రోజు బాలికల అండర్-17 పోటీలు జరుగగా, రెండో రోజు అండర్-19 బాలికలు తలపడ్డారు. ఈ టోర్నీలో ఉమ్మడి 10 జిల్లాల నుంచి మొత్తం 150 మంది ప్లేయర్లు పాల్గొన్నట్లు రాష్ట్ర బాక్సింగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పార్థసారథి పేర్కొన్నారు.



## సిరీస్ పాక్ కైవసం

జింబాబ్వేతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే పాకిస్థాన్ 2-0తో కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన రెండో టీ20లో జింబాబ్వే.. 2.4 ఓవర్లలో 57 పరుగులకు ఆలౌటైంది. పాక్ బౌలర్ సుఫియాన్ ముఖీమ్ (5/3) ఐదు వికెట్ల ప్రదర్శనతో జింబాబ్వే విలవిల్లాడింది. అనంతరం లక్ష్యాన్ని పాక్.. 5.3 ఓవర్లలోనే వికెట్లేమీ నష్టపోకుండా ఛేదించింది.




## కివీస్‌కు షాక్ డబ్ల్యూటీసీ పాయింట్లలో కోత

వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో ఉన్న న్యూజిలాండ్ క్రికెట్ జట్టుకు షాక్ తగిలింది. స్వదేశంలో ఇంగ్లండ్‌తో క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన తొలి టెస్టులో స్లో ఓవర్ రేట్ కారణంగా ఆ జట్టుకు మూడు పాయింట్ల కోత విధిస్తూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. పాయింట్ల కోతనే గాక ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులోనూ 15 శాతం జరిమానా పడింది. కివీస్‌తో పాటు ఇంగ్లండ్‌కూ ఇది వర్తించనుంది. దీంతో న్యూజిలాండ్ డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ప్రస్తుతం 47.92 పాయింట్ల శాతంతో ఐదో స్థానంలో నిలిచింది.



## నందమూరి మోక్షజ్ఞ మూవీకి ముహూర్తం సెట్

రెడీ ఫర్ సమ్ యాక్షన్? ఏంటి.. సిద్ధమేనా?... అంత నిదానంగా అడుగుతారేంటండీ.. మేం ఎప్పటి నుంచో వేయి కళ్లతో ఎదురుచూస్తుంటే అంటారా? విషయం అర్థమైన వారయితే మీలాగే రియాక్ట్ అవుతారు.. అసలు దేని గురించి ఇదంతా అని ఆలోచించే వారైతే... ఇక ఆలస్యం చేయడం ఎందుకు... కలిసి మాట్లాడుకుందాం... పదండి. నందమూరి మోక్షజ్ఞ రీసెంట్ ఫొటోని చూశారా? ఫ్యాన్స్ కోసమే స్పెషల్‌గా షేర్ చేశారు ప్రశాంత్ వర్మ. సింబా ఈజ్ కమింగ్ అంటూ ఆయన యాడ్ చేసిన హ్యాష్‌ట్యాగ్ నందమూరి సర్కిల్స్ లో జోష్ నింపుతోంది. మా బాలయ్యబాబు ముద్దుల కొడుకు ఎంట్రీ కోసం మేం ఎన్నాళ్లుగానో వెయిటింగ్ అంటూ ఇన్‌స్టంట్‌గా షేర్ చేసుకుంటున్నారు ఫ్యాన్స్. ప్రశాంత్ వర్మ పోస్టుకి మోక్షజ్ఞ రిప్లై ఇవ్వడం కూడా బావుంది. ఇతిహాసాల స్ఫూర్తితో సోషియో ఫాంటసీ కంటెంట్‌తో ఈ మూవీని తెరకెక్కిస్తారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లోనే ఉంటుంది సినిమా. డిసెంబర్ 5న మూవీకి ముహూర్తం పెట్టేశారు మేకర్స్. ఓపెనింగ్‌కి ముందే మోక్ష్ నయా లుక్ పోస్ట్ చేసినందుకు ప్రశాంత్ వర్మ కి థాంక్స్ చెబుతున్నారు ఫ్యాన్స్.



## రికార్డ్ వసూళ్లను సాధిస్తున్న భూల్ భులయ్యా 3

ఆఫ్టర్ కోవిడ్ బాలీవుడ్ ఇండస్ట్రీలో ఫస్ట్ కమర్షియల్ బ్లాక్ బస్టర్ మూవీ భూల బులయ్యా 2. ఈ సినిమాతో హీరో కార్తిక్ ఆర్యన్ బాలీవుడ్ సేవియర్‌గా మారిపోయారు. భూల్ బులయ్యా కాన్సెప్ట్‌కు మంచి రెస్పాన్స్ రావటంతో ఈ ఫ్రాంచైజీలో త్రీక్వెల్‌ను సిద్ధం చేశారు మేకర్స్. త్రీక్వెల్‌తో హిస్టారిక్ బ్లాక్ బస్టర్‌ను అందుకున్నారు కార్తీక్. సౌత్‌లో సూపర్ హిట్ అయిన చంద్రముఖి సినిమాను నార్త్‌లో భూల్ బులయ్యా పేరుతో రీమేక్ చేశారు. అక్షయ్ కుమార్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా సూపర్ హిట్ అయ్యింది. దీంతో అదే కాన్సెప్ట్‌ను కొనసాగిస్తూ భూల్ బులయ్యా 2 రూపొందించారు. కార్తిక్ ఆర్యన్ హీరోగా తెరకెక్కిన సీక్వెల్ కూడా సూపర్ హిట్ కావటంతో పార్ట్ 3 మీద అంచనాలు భారీగా పెరిగిపోయాయి.సీక్వెల్‌కు భారీ హైప్ రావటంతో పార్ట్ 3ని వెంటనే పట్టాలెక్కించారు మేకర్స్. త్రీక్వెల్ కోసం మేకర్స్ ఎంచుకున్న కథ ఆడియన్స్‌కు బాగా కనెక్ట్ అయ్యింది. దీంతో తొలి రెండు భాగాలను మించి సక్సెస్ అయ్యింది భూల్ బులయ్యా 3. వసూళ్ల పరంగానూ కార్తిక్ కెరీర్‌లో బిగ్గెస్ట్ నెంబర్స్‌ను రికార్డ్ చేసింది.



## బికినీయే పెద్ద సమస్య అయ్యిందన్న నయన్.!

రీసెంట్‌గా తన పర్సనల్ ప్రొఫెనల్ లైఫ్ నేపథ్యంలో ఓ డాక్యుమెంటరీ చేసిన నయన్, ఆ షోలో కెరీర్ ఎర్లీ డేస్‌లో ఎదురైన ఇబ్బందుల గురించి ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. లేటెస్ట్ షోలో తన కెరీర్ ఎర్లీ డేస్‌లో ఎదురైన ఇబ్బందుల గురించి మాట్లాడారు నయనతార. గజిని సినిమాలో తన లుక్స్ విషయంలో అప్పట్లో దారుణమైన ట్రోల్స్ వచ్చాయని గుర్తు చేసుకున్నారు. డైరెక్టర్ ఎలాంటి డ్రెస్ వేసుకోమంటే నేను అదే వేసుకున్నా.. కానీ ఆ సినిమాలో నేను లావుగా ఉన్నానంటూ చాలా మంది కామెంట్ చేశారని గుర్తు చేసుకున్నారు. బిల్లా సినిమా టైమ్‌లోనూ అలాంటి ఇబ్బందులే ఎదుర్కొన్నా అన్నారు నయన్. ఆ సినిమాలో బికినీలో కనిపించటంతో ఒక్కసారిగా ఇండస్ట్రీ సర్కిల్స్‌లో డిస్కషన్ మొదలైందన్నారు. తాను బికినీ వేసుకోవటం అందరికీ సమస్యలా మారిందన్నారు. కానీ తాను ఏదో ప్రూవ్ చేయాలని అలా చేయలేదని, కేవలం కథ డిమాండ్ మేరకే బికినీ వేసుకున్నా అన్నారు నయన్.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, RNI Reg no. APTEL/2001/5268 printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020